Follow: @ANNTELUGU
REGISTERED NUMBER: APTEL/2014/58382
09-10-2025
ANN తెలుగు
# మహా పత్రిక
తిరుపతి, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 304 పేజీలు-04 వెల-రూ.6
PUBLISHED FROM TIRUPATI | HYDERABAD గురువారం WWW.EPAPER.MAHAADAILY.COM




## జూబ్లీహిల్స్ కాంగ్రెస్ అభ్యర్థిగా
# నవీన్ యాదవ్
### ప్రకటించిన ఏఐసీసీ.. ముందే చెప్పిన మహా

**హైదరాబాద్, మహా :** జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నిక కాంగ్రెస్ అభ్యర్థిగా నవీన్ యాదవ్ ను ఆ పార్టీ హైకమాండ్ ఖరారు చేసింది. ఈ మేరకు పార్టీ ఏఐసీసీ జనరల్ సెక్రటరీ కేసీ వేణుగోపాల్ అధికారిక ప్రకటన విడుదల చేశారు. జూబ్లిహిల్స్ కాంగ్రెస్ అభ్యర్థిగా నవీన్ యాదవ్ ను ఖరారుచేయబోతున్నారని మహా పత్రిక లో గతనెలలోనే ప్రత్యేక కథనం ప్రచురితమైన విషయం విదితమే. దీనిపై బుధవారం అధికారిక ప్రకటన వచ్చింది. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల షెడ్యూల్ ని ఎన్నికల కమిషన్ విడుదల చేయగా,. ఈనెల 13న నోటిఫికేషన్ విడుదల కానుంది. వచ్చేనెల 11 న పోలింగ్ నిర్వహించనున్నట్లు ఈసీ తెలిపింది. ఈ నేపథ్యంలో అలర్ట్ అయిన కాంగ్రెస్ అభ్యర్థి ఎంపికపై గత రెండు రోజులుగా కసరత్తు చేసింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్, ఇంచార్జి మంత్రులు, నియోజకవర్గ నేతలతో చర్చించి నవీన్ యాదవ్ ను పార్టీ అభ్యర్థిగా ఖరారు చేసి హైకమాండ్ కు పంపారు. బుధవారం హైకమాండ్ అధికారికంగా ప్రకటించింది. జూబ్లీహిల్స్ టికెట్ కోసం అజారుద్దీన్, బొంతు రామ్మోహన్, సిఎన్ రెడ్డి, విజయలక్ష్మి తదితరులు పోటీపడ్డారు. స్థానిక బీసీ నేతకు టికెట్ ఇవ్వాలని భావించిన హైకమాండ్ నవీన్ యాదవ్ వైపు మొగ్గుచూపింది. నవీన్ యాదవ్ అయితే గెలుస్తాడని పార్టీ హైకమాండ్ నిర్వహించిన పలు సర్వేల్లో తేలింది. ఎంఐఎం కూడా నవీన్ యాదవ్ వైపే మొగ్గు చూపింది. ముస్లిం యాదవ్ కాంబినేషన్ తో జూబ్లిహిల్స్ లో మంచి విజయం సాధిస్తామని కాంగ్రెస్ ధీమాగా ఉంది.

**టాప్ న్యూస్**

## భారత్‌తో యుద్ధం జరిగే అవకాశం
- పాకిస్థాన్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ ప్రగల్భాలు



02

## జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో పోటీ చేస్తా
- అభ్యర్థుల జాబితాలో నా పేరు కూడా
- బీజేపీ నాయకురాలు మాధవీలత



02

## పూజా హెగ్డే రికార్డ్
- మూడేళ్ళ తర్వాత రీఎంట్రీ
- కళ్ళుచెదిరే ఆఫర్



08





బంగారం ధరలు


| | |
|---|---|
| 24 క్యారెట్ | 1,23,930 |
| 22 క్యారెట్ | 1,13,600 |
| సిల్వర్ (కేజీ) | 1,60,000 |





## చంద్రబాబు మెచ్చిన.. సుంకిరెడ్డి పథకం
- రెండేళ్ళుగా కల్వకుర్తిలో మొబైల్ హెల్త్ క్యాంప్ లు
- ఇపుడు ఏపీలో అదే సంజీవనిగా అమలు
- సుంకిరెడ్డి విజన్ పై ప్రశంసలు

02




# హైటెన్షన్
## ఇటు నోటిఫికేషన్ అటు విచారణ
- స్థానికానికి అంతా రెడీ .. నేటి నుండే ఎంపీటీసీ, జడ్పీటీసీ నామినేషన్లు
- మరోవైపు హైకోర్టు తీర్పుపై హైటెన్షన్
- బీసీలకు 42% రిజర్వేషన్లపై సీఎం రేవంత్ పట్టు
- సీఎం ఆదేశాలతో హైకోర్టులో మోహరించిన బీసీ మంత్రులు, పీసీసీ చీఫ్

**హైదరాబాద్, మహా:** నరాలు తెగే ఉత్కంఠ.. ఐదు గంటల పాటు కాంగ్రెస్ తరుపున బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకు మద్దతుగా దిగ్గజ న్యాయవాది అభిషేక్ సింగ్వీ వాదనలు, మరోవైపు ప్రభుత్వం జారీచేసిన జీవో కొట్టివేయాలంటూ పిటిషన్ తరుపున న్యాయవాదుల వాదనలు. ఏం జరుగుతుందోనని క్షణక్షణం ఉత్కంఠ. వరల్డ్ కప్ ఫైనల్ చూసినట్లు రిజర్వేషన్ల అంశం ఏమవుతుంది? స్థానిక ఎన్నికలు జరుగుతాయా? అన్నంత ఉత్కంఠతో లైవ్ లో సోషల్ మీడియా ద్వారా హైకోర్టు వాదనలు చూస్తూ రాష్ట్రప్రజలు క్షణక్షణం ఉత్కంఠ అనుభవించారు. మరోవైపు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విచారణను ఎప్పటికపుడు ఆరాతీస్తూ ప్రభుత్వం తరుపున బలంగా వాదనలు వినిపించేందుకు కసరత్తు చేయాలని, ప్రభుత్వ వాదన నెగ్గేందుకు కష్టపడాలంటూ పీసీసీ చీఫ్ తో సహా మంత్రులందరినీ హైకోర్టు దగ్గరే మోహరించారు. తీవ్ర ఉత్కంఠ అనంతరం ఎన్నికల అంశంపై మాట్లాడకుండా.. విచారణను గురువారం మధ్యాహ్నానికి వాయిదా వేయడంతో నోటిఫికేషన్ కు లైన్ క్లియర్ అయినట్లయింది. ఇంత పెద్ద అంశంపై అటు బిజెపి ఇటు బిఆర్ఎస్ వ్యూహాత్మక మౌనం పాటించడంపై ఆసక్తికర చర్చ సాగుతోంది. మరోవైపు ఎన్నికల్లో పోటీ చేయాలనుకున్నవారు, రిజర్వేషన్లు మారితే అవకాశం దక్కుతుందనుకున్నవారు.. అందరూ పరేషాన్ లో ఉన్నారు. ఈ ఎలక్షన్లు జరుగుతయా.. జరిగితే నిలుస్తయా? అంటూ ఆందోళన చెందుతున్నారు.

మిగతా 2లో

## లైవ్‌లో.. సీఎం రేవంత్
### హైకోర్టు వాదనలపై ఫుల్ అలర్ట్
పీసీసీ చీఫ్, మంత్రుల మోహరింపు
కోర్టు వాయిదాపడగానే సీఎం ఇంటికి ఏజీ, మంత్రులు

02

## ఎటూ తేల్చని హైకోర్టు
### నేడు మధ్యాహ్నం 2.15కు వాయిదా

వివరాలు 2లో

**స్టాక్ మార్కెట్**

| | |
|---|---|
| సెన్సెక్స్ | 81,773.66 |
| నిఫ్టీ | 25,046.15 |

**ఈరోజు గుడ్డు ధరలు**

| | 1 పీస్ | ట్రే |
|---|---|---|
| ఎన్ఈసీసీ గుడ్డు ధర | 5.2 | 156 |
| హోల్ సేల్ గుడ్డు ధర | 5.2 | 156 |
| రిటైల్ గుడ్డు ధర | 5.51 | 165.36 |

**ఈరోజు చికెన్ ధరలు**

| | చికెన్ | స్కిన్ లెస్ | బోన్ లెస్ |
|---|---|---|---|
| 1 కేజీ రిటైల్ ధర | 190 | 230 | 250 |
| హోల్ సేల్ ధర | 170 | 210 | 220 |

# గ్రూప్-1 పరీక్ష రద్దు చేయాల్సిందే...
- బోనస్ ఉద్యోగాలు ఇచ్చుకోండి కానీ.. బోగస్ ఉద్యోగాలు ఇవ్వొద్దు
- కాంగ్రెస్‌లో కొంత మందికి ఉద్యోగాలు ఇవ్వడానికి గ్రూప్ 1 పెట్టారా?
- గన్ పార్క్ వద్ద జాగృతి ఆధ్వర్యంలో చేపట్టిన ధర్నాలో కవిత వ్యాఖ్యలు




**హైదరాబాద్, మహా:** గ్రూప్ - 1 పరీక్షల్లో అక్రమాలతో నిరుద్యోగులకు అన్యాయం జరిగిందని, పరీక్షలను వెంటనే రద్దు చేసి, తిరిగి నిర్వహించాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత డిమాండ్ చేశారు. తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో గన్ పార్క్ వద్ద చేపట్టిన ధర్నాలో ఆమె మాట్లాడారు. గ్రూప్ - 1 అభ్యర్థులకు ధైర్యం ఇవ్వాలని మేము గన్ పార్క్ ధర్నా నిర్వహించామని.. పరీక్ష రద్దు చేయాలని తెలంగాణ జాగృతి టీజీపీఎస్సీ ముట్టడి చేసినప్పటికి ప్రభుత్వంలో చలనం లేదు అని విమర్శించారు.

మిగతా 2లో


## షెడ్యూల్ ప్రకారమే నామినేషన్ ప్రక్రియ
- బీసీ రిజర్వేషన్ల కేసు కచ్చితంగా గెలుస్తాం
- బీజేపీ బీసీల నోటి కాడ ముద్దను లాగే ప్రయత్నం చేస్తోంది
- టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్

02




## ఎన్నికల సంఘం రెడీ
### కమిషనర్ రాణికుముదిని వీడియో కాన్ఫరెన్స్

02

# గ్రూప్-1 పరీక్ష రద్దు చేయాల్సిందే...

(మొదటిపేజీ తరువాయి)

కాంగ్రెస్ పార్టీ నాయకుల కుటుంబాలకు బోనస్ ఉద్యోగాలు ఇచ్చుకోండి కానీ , బోగస్ ఉద్యోగాలు ఇవ్వొద్దు అన్నారు. రాహుల్ గాంధీ ఢిల్లీ నుంచి హైదరాబాద్ వచ్చి నిరుద్యోగుల కాళ్ళు పట్టుకొని ఓట్లు అడిగి, వారినే మోసం చేశారు అని కవిత ఆరోపించారు. ఎన్నికల హామీ జాబ్ క్యాలెండర్ ఇంతవరకు రిలీజ్ చెయ్యలేదు అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ ఇచ్చిన నోటిఫికేషన్ లోని పాత ఉద్యోగాలు ఇచ్చి, కొత్తగా ఉద్యోగాలు ఇచ్చాము అని కాంగ్రెస్ ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటుందని విమర్శించారు.

**ప్రభుత్వాన్ని నిరుద్యోగులే కులగొడుతారు**

గ్రూప్ - 1 పరీక్షను తప్పుడుగా నిర్వహించారని, పరీక్ష రద్దు అయ్యే వరకు ప్రభుత్వం మెడలు వంచేందుకు ఉద్యమం చేస్తామన్నారు కవిత. తెలంగాణలో ఉన్నటువంటి మేధావులు మౌనం వీడాలని.. గ్రూప్ 1 పరీక్ష పై హరగోపాల్ వంటి వారు మాట్లాడాలిని.. తాను కూడా అవసరం అయితే ఆయనను కలుస్తానని చెప్పారు. రాహుల్ గాంధీ మాటలు నమ్మి నిరుద్యోగులు కాంగ్రెస్ పార్టీకి అధికారం ఇచ్చారని, నిరుద్యోగులను మోసం చేస్తున్నందుకు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిరుద్యోగులే కులగొడుతారు అని హెచ్చరించారు. త్వరలోనే రౌండ్ టేబుల్ సమావేశాలు ఏర్పాటు చేసి నిరుద్యోగ యువతను జాగృతం చేస్తామని తెలిపారు. తెలంగాణ తెచ్చుకుందే నియామకాల కోసం అని, ఉద్యోగ నియామకాల్లో సుప్రీంకోర్టు ఆదేశాలు పాటించాలని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం గ్రూప్ 1 నియామకాల్లో ప్రెసిడెంటల్ ఆర్డర్ ద్వారా 8 మంది ఆంధ్ర వాళ్ళకి ఉద్యోగాలు ఇచ్చారు అని ఆరోపించారు. ప్రెసిడెంటల్ ఆర్డర్ పైన మేము ఉద్యమం చేస్తాం అని కవిత తెలిపారు.

## జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో పోటీ చేస్తా

- **అభ్యర్థుల జాబితాలో నా పేరు కూడా**
- **బీజేపీ నాయకురాలు మాధవీలత కీలక వ్యాఖ్యలు**

**హైదరాబాద్, మహా:** జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నికల బరిలో నిలిచేందుకు తాను సిద్ధంగా ఉన్నట్లు బీజేపీ నాయకురాలు మాధవీలత ప్రకటించారు. పార్టీ అధిష్ఠానం అవకాశం ఇస్తే ఎన్నికల యుద్ధానికి తాను సిద్ధమని ఆమె స్పష్టం చేశారు. బుధవారం మీడియా ప్రతినిధులతో మాట్లాడిన ఆమె, కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలపై తీవ్ర విమర్శలు చేశారు. ఈ సందర్భంగా మాధవీలత మాట్లాడుతూ.. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల పాలనల వల్ల తెలంగాణ ప్రజలు తీవ్రంగా నష్టపోయారపి వ్యాఖ్యానించారు. ఇప్పుడు రాష్ట్ర ప్రజలు మార్పు కోరుకుంటున్నారని, అధిష్ఠానం పరిశీలిస్తున్న అభ్యర్థుల జాబితాలో తన పేరు కూడా ఉందని తెలిసిందన్నారు. పార్టీ నాకు అవకాశం కల్పిస్తే జూబ్లీహిల్స్‌లో తప్పకుండా పోటీ చేస్తానని అంటూ ధీమా వ్యక్తం చేశారు.

**సీల్డ్ కవర్‌లో అభ్యర్థుల పేర్లు..**

ఇప్పటికే బీజేపీ నాయకులు పార్టీ కేడర్ నుంచి అభిప్రాయాలను సేకరించేందుకు నియమించిన త్రిసభ్య కమిటీ తన నివేదికను రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్ర రావుకు అందజేసింది. ఈ త్రిసభ్య కమిటీలో మాజీ ఎమ్మెల్యే ఎం.ధర్మారావు, మాజీ ఎంపీ పోతుగంటి రాములు, పార్టీ సీనియర్ నేత, అడ్వొకేట్ కోమల ఆంజనేయులు సభ్యులుగా ఉన్న సంగతి తెలిసిందే. ఈ త్రిసభ్య కమిటీ తాజాగా తన నివేదికను సీల్డ్ కవర్‌లో స్టేట్ చీఫ్‌కు అందజేసింది. అయితే సీల్డ్ కవర్‌లో అభ్యర్థులుగా జూటురు కీర్తి రెడ్డి, వీరపనేని పద్మ, లంకల దీపక్ రెడ్డిలను ప్రతిపాదించినట్లు తెలుస్తోంది.

## లైవ్ లో.. సీఎం రేవంత్

**హైకోర్టు వాదనలపై ఫుల్ అలర్ట్.. పీసీసీ చీఫ్, మంత్రుల మోహరింపు**
**కోర్టు వాయిదాపడగానే సీఎం ఇంటికి ఏజీ, మంత్రులు**

**హైదరాబాద్, మహా:** బీసీ రిజర్వేషన్లు విజయవంతం కావాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ వారికి 42 శాతం రిజర్వేషన్లు దక్కాలని పట్టుదలగా ఉన్న సీఎం రేవంత్ రెడ్డి.. బుధవారం హైకోర్టు వాదనలు ఉత్కంఠగా చూడడంతో పాటు ఉదయమే పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్, బీసీ మంత్రులతో మాట్లాడారు. హైకోర్టు దగ్గర అప్రమత్తంగా ఉండాలని, వాదనల సమయంలో ప్రభుత్వపరంగా ఏదైనా సమాచారం అవసరమున్నా.. ఇంకేదైనా అవసరమున్నా తక్షణం అందేందుకు వీలుగా వ్యవహరించాలని సూచించారు. బీసీలకు మద్దతుగా నిలవాలని, కాంగ్రెస్ తీసుకున్న రిస్క్.. ఈ అంశంపై నిబద్ధత ప్రజలకు తెలవాలని సూచించారు. హైకోర్టులో ప్రభుత్వం తరుపున బలమైన వాదనలు జరిగాయని బీసీ సంఘాలు హర్షం వ్యక్తం చేశాయి. కోర్టు వాయిదాపడగానే ఏజీతో పాటు పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్, మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, వాకిటి శ్రీహరిలు సీఎం రేవంత్ రెడ్డిని కలిశారు. బీసీ రిజర్వేషన్ల విషయంలో సీఎం పట్టుదలను ఈ సందర్భంగా నేతలు అభినందించారు. హైకోర్టులో విజయం తథ్యమని, రాష్ట్రప్రభుత్వం అన్నీ చట్టప్రకారం గత తీర్పులకు లోబడే చేసిందని ఈ సందర్భంగా నేతలు ధీమా వ్యక్తం చేశారు.

## ఇక నా మెయిల్ ఐడీ ఇదే..

**జీమెయిల్ కు గుడ్ బై చెప్పి జోహో మెయిల్ కు మారిన అమిత్ షా**

ఆత్మనిర్భర్ భారత్ దిశగా మరో అడుగు
తన కొత్త ఈమెయిల్ అడ్రస్‌ను సోషల్ మీడియా ద్వారా వెల్లడించిన అమిత్ షా
కొద్ది రోజుల క్రితమే జోహోకు మారిన రైల్వే, ఐటీ శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్
ప్రభుత్వ కార్యాలయాల్లో జోహో యాప్స్ వాడాలని విద్యాశాఖ ఆదేశాలు
'ఆత్మనిర్భర్ భారత్'లో భాగంగా స్వదేశీ టెక్నాలజీకి ప్రోత్సాహం
చెన్నైకి చెందిన శ్రీధర్ వెంబు స్థాపించిన సంస్థే జోహో




**న్యూఢిల్లీ, మహా:** దేశీయ టెక్నాలజీ వినియోగాన్ని ప్రోత్సహించే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక అడుగులు వేస్తోంది. ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చిన 'ఆత్మనిర్భర్ భారత్' స్ఫూర్తితో, కేంద్ర హోంమంత్రి అమిత్ షా తన అధికారిక ఈమెయిల్ సేవలను గూగుల్‌కు చెందిన జీమెయిల్ నుంచి స్వదేశీ సంస్థ అయిన 'జోహో మెయిల్'కు మార్చుకున్నారు. ఈ మార్పును ఆయన స్వయంగా సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' ద్వారా ప్రకటించారు. "అందరికీ నమస్కారం, నేను జోహో మెయిల్‌కు మారాను. దయచేసి నా ఈమెయిల్ అడ్రస్‌లో మార్పును గమనించగలరు. నా కొత్త ఈమెయిల్ చిరునామా: amitshah.bjp@zohomail.in. భవిష్యత్తులో నాతో ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపేవారు ఈ చిరునామాను ఉపయోగించగలరు" అని తన పోస్టులో అమిత్ షా పేర్కొన్నారు. కేంద్ర మంత్రులు స్వదేశీ సాంకేతికత వైపు మొగ్గు చూపడం ఇదే మొదటిసారి కాదు. కొద్ది రోజుల క్రితమే కేంద్ర రైల్వే, ఐటీ శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ కూడా జోహో ప్లాట్‌ఫామ్‌కు మారారు. డాక్యుమెంట్లు, స్ప్రెడ్‌షీట్లు, ప్రజెంటేషన్ల కోసం ఇది ఒక అద్భుతమైన వేదిక అని ఆయన ప్రశంసించారు. ప్రధాని పిలుపు మేరకు ప్రతి ఒక్కరూ స్వదేశీ ఉత్పత్తులు, సేవలను స్వీకరించాలని ఆయన కోరారు. మరోవైపు, కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ కూడా తమ అధికారులందరూ అధికారిక పనుల కోసం జోహో ఆఫీస్ సూట్‌ను ఉపయోగించాలని ఇటీవలే ఆదేశాలు జారీ చేసింది. మైక్రోసాఫ్ట్ ఆఫీస్, గూగుల్ వర్క్‌స్పేస్ వంటి విదేశీ ప్లాట్‌ఫామ్‌లకు బదులుగా జోహో రైటర్, జోహో షీట్, జోహో షో వంటి వాటిని వాడాలని స్పష్టం చేసింది. ఈ కొత్త ప్లాట్‌ఫామ్‌పై అధికారులకు అవగాహన కల్పించేందుకు ఎన్ఐసీ (NIC) ద్వారా ప్రత్యేక సహాయం అందిస్తున్నట్లు ప్రభుత్వ సర్క్యులర్‌లో తెలిపారు. చెన్నైకి చెందిన శ్రీధర్ వెంబు స్థాపించిన జోహో, ప్రపంచ సాఫ్ట్‌వేర్ రంగంలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకోవడం గమనార్హం. ఇటీవలే జోహో అభివృద్ధి చేసిన 'అరట్టై' మెసేజింగ్ యాప్ ప్రకంపనలు సృష్టిస్తోంది. ఈ రంగంలో నెంబర్ వన్ గా ఉన్న వాట్సాప్ కు సవాల్ విసురుతోంది.

# హైటెన్షన్

(మొదటిపేజీ తరువాయి)

స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం నేడు నోటిఫికేషన్ జారీ చేయనుంది. స్థానిక సంస్థల ఎన్నికలపై హైకోర్టు నుంచి ఎలాంటి అడ్డంకులు లేనందున నోటిఫికేషన్ జారీచేయనున్నాయి. స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల స్వీకరణకు పటిష్ఠ ఏర్పాటు చేయాలని రాష్ట్ర ఎన్నికల సంఘం కమీషనర్ ఐ.రాణి కుముదిని అన్నారు. దీనిపై వీడియో కాన్ఫరెన్స్ కూడా నిర్వహించారు . హైకోర్టు ఆదేశాల మేరకు నడుచుకుంటామని తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ పై స్టే ఇవ్వాలని పిటిషనర్లు కోరినా కూడా హైకోర్టు నిరాకరించింది.

**సుప్రీం తీర్పుకు లోబడి రిజర్వేషన్లు ఉండాలి**

రిజర్వేషన్లు పెంచుకునే అధికారం ప్రభుత్వానికి ఉన్నా 50 శాతానికి మించరాదు. విద్య, ఉద్యోగాల్లో 50శాతం దాటినా రాజకీయ రిజర్వేషన్లు పెంచరాదు. ఏజెన్సీల్లో ఎస్టీలకు మాత్రమే రిజర్వేషన్ల సీలింగ్ వర్తించదు. 42శాతం రిజర్వేషన్లపై శాస్త్రీయ ఆధారాలు చూపలేదు. బీసీ కుల గణన చేశారు. కానీ బహిర్గతం చేయలేదు. బీసీ కులగణన ఆధారంగా 42శాతం రిజర్వేషన్లు అంటున్నారు. ఎస్సీ, ఎస్టీల రిజర్వేషన్లకు మాత్రం 2011 జనాభా ఆధారం అని చెబుతున్నారు. ఎస్సీ, ఎస్టీల జనాభా పెరిగిందా? తగ్గిందా? ఆ లెక్కలు ప్రభుత్వం వద్ద లేవు. ఎస్సీ, ఎస్టీల జనాభాను లెక్కలోకి తీసుకోకుండా బీసీ రిజర్వేషన్లు ఎలా చేస్తారు? రాజ్యాంగ బద్ధంగా ఎన్నికల నిర్వహణకు మేం వ్యతిరేకం కాదు. రాజ్యాంగ విరుద్ధంగా ఎలా నిర్వహిస్తారు? ట్రిపుల్ టెస్ట్‌ను పాటించకుండా రాష్ట్ర ప్రభుత్వాలు రిజర్వేషన్లపై చట్టం చేయలేవు. 50 శాతం రిజర్వేషన్ల పరిధి దాటడం రాజ్యాంగ విరుద్ధం అంటూ పిటిషనర్ల తరుపున వాదనలు వినిపించారు.

**ప్రభుత్వం తరపున అభిషేక్ సింఘ్వీ వాదనలు..**

చట్టాన్ని ఎవరూ ఛాలెంజ్ చేయలేదు. చట్టం ఆధారంగా చేసిన జీవోలను ఛాలెంజ్ చేశారు. జీవోకు మూలమైన చట్టాన్ని సవాల్ చేయకుండా జీవోను మాత్రమే ఛాలెంజ్ చేయడం కుదరదు.దాదాపు అన్ని రాజకీయ పార్టీలు బీసీ రిజర్వేషన్లను సమర్థించాయి. రిజర్వేషన్ల గరిష్ఠ పరిమితి దాటకూడదని సుప్రీం కోర్టు ఆదేశామే తప్పితే.. రాజ్యాంగంలో ఎక్కడా నిబంధన లేదు. డేటా ఆధారంగా ప్రభుత్వానికి, శాసన వ్యవస్థకు తగిన నిర్ణయం తీసుకునే అధికారం ఉంది. శాసన వ్యవస్థ చేసిన చట్టాన్ని ఎవరూ ప్రశ్నించలేరు. సవరణ చేసినా, చట్టం చేసినా శాసనవ్యవస్థదే నిర్ణయం ఉంటుంది. చట్టసభలు చేసిన చట్టాలపై కొంతమంది గవర్నర్లు ఏ నిర్ణయమూ చెప్పడం లేదు. బిల్లును ఆమోదించడం లేదు, తిరస్కరించడం లేదు, తిప్పిపంపడం లేదు. ఇప్పటికే ఎన్నికల షెడ్యూల్ విడుదలైంది. ఎన్నికల ప్రక్రియలో కోర్టులు జోక్యం చేసుకోవద్దనే తీర్పులున్నాయి. ఈ సమయంలో స్టే ఇవ్వడం సరికాదు. సమగ్ర అధ్యయనం చేసిన తర్వాతే బీసీ బిల్లు చేశారు, జీవో తెచ్చారు. పూర్తి వాదనలు విన్న తర్వాతే జీవో నెంబరు 9పై నిర్ణయం తీసుకోవాలి అంటూ ప్రభుత్వం పక్షాన అభిషేక్ సింగ్వీ వాదనలు వినిపించారు.

## ఎటూ తేల్చని హైకోర్టు.. నేడు మధ్యాహ్నం 2.15కు వాయిదా

**హైదరాబాద్, మహా:** బీసీ రిజర్వేషన్లపై విచారణను తెలంగాణ హైకోర్టు గురువారం మధ్యాహ్నం 2:15గంటలకు వాయిదా వేసింది. తెలంగాణ ప్రభుత్వం తరపున మరికొన్ని వాదనలు వినిపిస్తామని అడ్వకేట్ జనరల్ న్యాయమూర్తులను కోరారు. బీసీ రిజర్వేషన్లపై ప్రభుత్వం తరపున అడ్వకేట్లు బలమైన వాదనలు వినిపించారు. అన్ని రాజకీయ పార్టీలు బీసీ రిజర్వేషన్లను సమర్థించాయని, బీసీ రిజర్వేషన్ల చట్టాన్ని ఎవరూ ఛాలెంజ్ చేయలేదని, చట్టం ద్వారా జారీ చేసిన జీవోలను ఛాలెంజ్ చేశారని అన్నారు. ప్రభుత్వ ఉత్తర్వులకు కారణమైన చట్టాన్ని సవాల్ చేయకుండా జీవోను ఛాలెంజ్ చేయడం కుదరదని ప్రభుత్వ తరుపు న్యాయవాది అభిషేక్ సింఘ్వి వాదించారు. రిజర్వేషన్ల గరిష్ఠ పరిమితి 50% దాటకూడదని రాజ్యాంగంలో లేదని, సుప్రీంకోర్టు ఆదేశం మాత్రమే ఉందన్నారు. ఎంపిరికల్ డేటా ఉంటే 50% క్యాప్ పెంచవచ్చని తీర్పులున్నాయని, డేటా ఆధారంగా ప్రభుత్వానికి, శాసన వ్యవస్థకు నిర్ణయాధికారం ఉంటుందన్నారు అభిషేక్ సింఘ్వి. కానీ 2018లో తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం పాసైన సమయంలో ఈ కసరత్తు జరగలేదన్నారు. 2019లో ఈడబ్ల్యుఎస్ 10% రిజర్వేషన్లు దేశవ్యాప్తంగా అమల్లోకి వచ్చాయని దీంతో రిజర్వేషన్లు 60శాతం దాటాయన్నారు. కులగణన సర్వే డేటాను అభిషేక్ సింఘ్వీ కోర్టు ముందు ఉంచారు. ఈ డేటా ఫోర్జరీ అని పిటిషనర్లు అనుకుంటున్నారోమోనని, కులగణన ముమ్మాటికీ ఎంపిరికల్ డేటానే అని సింఘ్వీ అన్నారు. డోర్ టు డోర్ సమగ్ర సర్వే తర్వాతే బీసీలకు 42% రిజర్వేషన్ ఇవ్వాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని సింఘ్వీ అన్నారు.

## షెడ్యూల్ ప్రకారమే నామినేషన్ ప్రక్రియ

- **బీసీ రిజర్వేషన్ల కేసు కచ్చితంగా గెలుస్తాం**
- **బీజేపీ బీసీల నోటి కాడ ముద్దను లాగే ప్రయత్నం చేస్తోంది**
- **టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్**

**హైదరాబాద్, మహా:** బీసీ రిజర్వేషన్ల అంశంపై హైకోర్టులో రాష్ట్ర ప్రభుత్వం తరపు న్యాయవాదులు బలమైన వాదనలు వివరించారని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. బీసీ రిజర్వేషన్లపై హైకోర్టులో విచారణ నేటికి వాయిదా పడిన అనంతరం.. ఆయన మీడియాతో మాట్లాడారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకారమో యదావిధిగా నామినేషన్ ప్రక్రియ కొనసాగుతుందన్నారు. నేటి నుంచి జడ్పీటీసీ,ఎంపీటీసీ నామినేషన్ స్వీకరణ ఉంటుందన్నారు. బీసీ రిజర్వేషన్ల కేసు కచ్చితంగా గెలుస్తాం అని తేల్చి చెప్పారు. 1930 (దాదాపు 90 సంవత్సరాల) తరవాత తెలంగాణలో కుల సర్వే జరిగిందన్నారు. బీజేపీ బీసీల నోటి కాడ ముద్దను లాగే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. బీసీల కోసం మూడు చట్టాలు తీసుకొచ్చాం. బిల్లుకి అసెంబ్లీలో అన్ని పార్టీలు మద్దతు ఇచ్చాయి అని తెలిపారు. బీసీ రిజర్వేషన్ల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం చిత్త శుద్ధితో ముందుకు వెళ్తుందన్నారు.

**90 శాతం స్థానాలను గెలుచుకుంటాం..**

కుల మతాలకు అతీతంగా సిఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు, ప్రజాప్రతి నిధులు మద్దతు తెలిపారని చెప్పారు. పది నియోజక వర్గాల్లో పాత కాంగ్రెస్ నేతల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుంటామని, 90 శాతం స్థానాలను స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుచుకుంటాం అని విశ్వాసం వ్యక్తం చేశారు. నామినేషన్‌లు వేయాలని పార్టీ నాయకులకు చెప్పాము.. ఇప్పటికే ఇంచార్జి మంత్రులు.. ఎమ్మెల్యేలు అభ్యర్దుల ఎంపిక చేసి పెట్టారు. స్థానిక సంస్థల ఎన్నికలు మేం చెప్పినట్టు 42 శాతం రిజర్వేషన్ తోనే ఉంటాయి. తలసానికి ప్రేమ ఉంటే.. ఇంప్లేడ్ కావచ్చు కదా..? అని ప్రశ్నించారు. జూబ్లిహిల్స్ అభ్యర్థినీ ఇవాళ.. లేదంటే రేపు ప్రకటిస్తాం అన్నారు. బలమైన నాయకుడు నవీన్ యాదవ్ కాబట్టి.. కేసులు పెడుతున్నారని ఆరోపించారు.




## చంద్రబాబు మెచ్చిన.. సుంకిరెడ్డి పథకం

- **రెండేళ్ళుగా కల్వకుర్తిలో మొబైల్ హెల్త్ క్యాంప్ లు**
- **ఇపుడు ఏపీలో అదే సంజీవనిగా అమలు**
- **సుంకిరెడ్డి విజన్ పై ప్రశంసలు**

**కల్వకుర్తి, మహా :**

ప్రజలకు సేవ చేయాలన్న నిబద్ధత, ప్రజల కోసం ఏదో చేయాలన్న తపన ఆయనను మొబైల్ హెల్త్ క్యాంప్ ల వైపు మళ్ళించింది. హైటెక్ పద్ధతిలో ప్రతీనెలా సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి నిర్వహిస్తున్న హెల్త్ క్యాంపులు రెండేళ్ళుగా కల్వకుర్తి ప్రజల మనసులు గెలిచాయి. ఇదే పథకం ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు మనసును కూడా గెలిచింది. అదే సంజీవనిలాగా బుధవారం ప్రారంభమైంది. సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి విజనరీ ఏంటో ఈ పథకం ద్వారా అర్థమవుతోందని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సుంకిరెడ్డి మొబైల్ హెల్త్ క్యాంప్ ద్వారా ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందిస్తూ, ప్రజల ఆరోగ్య భద్రతలో కల్వకుర్తి కి కొత్త దిశను చూపిస్తున్నారు. ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం "సంజీవిని" పథకాన్ని ప్రజల ఆరోగ్య రక్షణ కోసం ప్రారంభించగా, ఇదే కార్యక్రమం ప్రభుత్వ సహకారం లేకుండానే సొంతంగా నిర్వహిస్తున్నాడు సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి. కల్వకుర్తి ప్రజల ఆరోగ్యంపై సుంకిరెడ్డికి ఉన్న దూరదృష్టి,, ప్రజల అవసరాల పట్ల ఉన్న విజనే ఆయనను ముందుకు నడిపిస్తోంది. "ఆరోగ్య కల్వకుర్తి" లక్ష్యంగా "ప్రతి గ్రామానికి,ప్రతి కుటుంబానికి ఉచిత వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా తన సొంత నిధులతో ఐక్యత ఫౌండేషన్ ద్వారా మొబైల్ హెల్త్ క్యాంప్ లు నిర్వహిస్తూ ముందుకు సాగుతున్న నిజమైన నాయకుడు సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి అని ప్రజలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.

**యువతకు ఆసరా...**

ప్రజల అవసరాన్ని ముందుగానే గుర్తించి గతంలో నిరుద్యోగ యువత కోసం స్కిల్ సెన్సెస్ నిర్వహించి,జాబ్ మేళాలు ఏర్పాటు చేసినా, ఇప్పుడు ఉచిత మొబైల్ హెల్త్ క్యాంప్స్ నిర్వహించినా, ప్రభుత్వాలు ఆలోచించేలోపే ఆచరణలో పెట్టే నాయకత్వం సుంకిరెడ్డి సొంతం. ఇది కేవలం సేవ మాత్రమే కాదు... సమాజానికి ఏం కావాలో,ఏం ఇవ్వాలో ముందుగానే ఆలోచిస్తూ ఒక విజన్‌తో సేవా కార్యక్రమాలు చేస్తూ ముందుకు సాగుతున్న కొత్త నాయకత్వం కల్వకుర్తి ప్రాంతానికి ఎంతో అవసరమని స్థానిక యువత అంటోంది.

## ఎన్నికల సంఘం రెడీ

**కమిషనర్ రాణికుముదిని వీడియో కాన్ఫరెన్స్**

**హైదరాబాద్, మహా :** స్థానిక ఎన్నికల నిర్వహణకు ఎన్నికల సంఘం అన్ని ఏర్పాట్లు పూర్తిచేసింది. గురువారం యథావిధిగా నోటిఫికేషన్‌ను ఎన్నికల కమిషన్ విడుదల చేయనుంది. ఈ మేరకు అన్ని జిల్లాల కలెక్టర్లతో ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎన్నికల నోటిఫికేషన్, నామినేషన్ల ప్రక్రియపై చర్చించారు. ఈ సందర్భంగా ఎన్నికల నిర్వహణకు తామంతా సిద్ధంగా ఉన్నామని అన్ని జిల్లాల కలెక్టర్లు ఈసీకి తెలిపారు. నానినేషన్ల సందర్భంగా శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా చూసుకోవాలని ఈసీ ఆదేశించారు.

**రెండు దశల్లో ఎంపీటీసీ, జడ్పీటీసీ..**

5 దశల్లో 31 జిల్లాల్లోని 565 మండలాల్లో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని ఈసీ షెడ్యూల్ ప్రకటించిన సంగతి తెలిసిందే. గురువారం ఉదయం 10:30గంటల నుంచి ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభిస్తారు. నామినేషన్లకు చివరి తేదీ అక్టోబర్ 11, ఆ తర్వాత రోజు నామినేషన్ల పరిశీలన, అక్టోబర్ 15న ఉపసంహరణ గడువు ఉంది. రెండో విడత ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు అక్టోబర్ 13న నామినేషన్ ప్రక్రియ ప్రారంభమవుతుంది. నామినేషన్లకు చివరి తేదీ అక్టోబర్ 15, మరుసటి రోజు నామినేషన్ల పరిశీలన, ఉపసంహరణ గడువు అక్టోబర్ 19.అక్టోబర్ 23న ఎంపీటీసీ, జడ్పీటీసీ తొలి విడత పోలింగ్.. అక్టోబర్ 27న రెండో విడత పోలింగ్ ఉంటుంది. నవంబర్ 11న ఓట్ల లెక్కింపు ఉంటుంది. గతంలో తొలివిడతలో ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్, వరంగల్, నల్లగొండ, రంగారెడ్డి జిల్లాల్లో ఎన్నికలు జరగ్గా.. ఈ సారి ఎన్నికల సంఘం ఎలా నోటిఫికేషన్ ఇస్తుందో చూడాలి.

## భారత్‌తో యుద్ధం జరిగే అవకాశం

**పాకిస్థాన్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ ప్రగల్భాలు**



**మహా:** పాకిస్థాన్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ కీలక వ్యాఖ్యలు చేశాడు. ఆపరేషన్ సిందూర్‌తో భారత్ దెబ్బను రుచి చూసినా.. పాకిస్థాన్ ప్రగల్భాలు మాత్రం ఆపట్లేదు. తాజాగా ఆ దేశ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ మాట్లాడుతూ.. భారత్‌తో మళ్లీ యుద్ధం జరిగే అవకాశాలను తోసిపుచ్చలేమన్నాడు. అయితే, ఈసారి యుద్ధం వస్తే తాము అనుకూల ఫలితాలు సాధిస్తామంటూ బీరాలు పలికారు. పాక్ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఖవాజా ఆసిఫ్ ఈ వ్యాఖ్యలు చేశారు. ''నేను ఉద్రిక్తతలను కోరుకోవట్లేదు. కానీ, ముప్పు పొంచి ఉన్నమాట వాస్తవం. భారత్‌తో యుద్ధం అవకాశాలను కొట్టిపారేయలేం. కానీ, ఈసారి యుద్ధం జరిగితే.. గతంలో కన్నా మెరుగైన ఫలితాలు సాధిస్తాం'' అంటూ రెచ్చగొట్టేలా మాట్లాడారు. సీమాంతర ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తోన్న పాక్‌కు ఇటీవల భారత్ ఆర్మీ చీఫ్ గట్టి వార్నింగ్ ఇచ్చిన సంగతి తెలిసిందే. దానికి బదులిస్తూనే ఖవాజా ఈ విధంగా కవ్వింపులకు పాల్పడ్డాడు.

## జూబ్లీహిల్స్‌లో గెలిస్తేనే ప్రభుత్వానికి చెక్

- **బాకీ కార్డుల ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించాలి**
- **పార్టీ నేతలకు మాజీ మంత్రులు హరీశ్ రావు, కేటీఆర్ సూచనలు**



**హైదరాబాద్, మహా:** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపొందినప్పుడే రాష్ట్ర ప్రభుత్వానికి అడ్డుకట్ట వేయగలమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, సీనియర్ ఎమ్మెల్యే హరీశ్ రావు స్పష్టం చేశారు. ఉప ఎన్నికల్లో ఐక్యంగా పనిచేసి పార్టీ అభ్యర్థి మాగంటి సునీత విజయానికి కృషి చేయాలని వారు పిలుపునిచ్చారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలపై కేటీఆర్, హరీశ్ రావు పార్టీ నేతలకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత నెలకొందని అన్నారు. దీనిని సమర్థవంతంగా ఉపయోగించుకోవాలని సూచించారు. ఎన్నికల బాధ్యతలు అప్పగించిన మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇన్‌ఛార్జిలు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. ఎవరికి అప్పగించిన పనులకు వారు పూర్తిస్థాయిలో బాధ్యత వహించాలని తెలిపారు. బాకీ కార్డుల ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించాలని సూచించారు. ఉదయం, సాయంత్రం వేళల్లో పాదయాత్రలు చేపట్టాలని అన్నారు. బూత్ కమిటీలు నిరంతరం ఓటర్లతో సంప్రదింపులు జరపాలని పేర్కొన్నారు. ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలవాలని ఆకాంక్షించారు. ప్రచారం చివరి దశలో రోడ్డు షోలు నిర్వహించాలని నిర్ణయించారు.

## పోరు స్థానికం

- **అయినా పోరాటమంతా హైటెక్**
- **స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ రాకతో సందడి**
- **సామాజిక మాధ్యమాలే వేదికగా పార్టీ శ్రేణుల పోటాపోటీగా పోస్టులు**
- **హద్దులు దాటితే చర్యలుంటాయని హెచ్చరిస్తున్న అధికారులు**

**హైదరాబాద్, మహా:** రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ విడుదలైంది. దీంతో గ్రామాల్లో సందడి వాతావరణం నెలకొంది. ఆశావహులు, పార్టీ శ్రేణులు సామాజిక మాధ్యమాలను వేదికగా చేసుకుని పోటాపోటీగా పోస్టులు చేస్తున్నారు. వీటినే అస్త్రాలుగా చేసుకుని మాటల యుద్ధం చేసుకుంటున్నారు. మంచి ఆలోచనలనూ పంచుకుంటున్నారు. ప్రతి ఇంటా స్మార్ట్ ఫోన్ ఉండటంతో వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టా, ఎక్స్, యూట్యూబ్ తదితర సోషల్‌మీడియా ప్లాట్‌ఫాంలను వినియోగిస్తున్నారు. పోటీ చేసే అభ్యర్థులు గ్రామ, మండల గ్రూపుల్లో మీ ముందుకు సర్పంచి, ఎంపీటీసీ, జడ్పీటీసీ అభ్యర్థులుగా వస్తున్నానని వీడియోలు, ఫొటోల ద్వారా సందేశాలు పంపుతున్నారు. ఎన్నికల సమయాల్లో సామాజిక మాధ్యమాల్లో సంయమనం పాటించాలి. లేదంటే కేసులు ఎదుర్కోక తప్పదని పోలీసు అధికారులు హెచ్చరిస్తున్నారు. అభ్యంతరకర పోస్టులు పెడితే ఇబ్బందుల్లో పడతారని, యువత తమ భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని సూచిస్తున్నారు.

**వారి ఖాతాలపై ప్రత్యేక నిఘా :**

ఆశావహులు, నాయకులు, కార్యకర్తల సామాజిక మాధ్యమాల ఖాతాలపై పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టారు. అభ్యంతరకరమైన పోస్టులు, వ్యక్తిగత దూషణలు, రెచ్చగొట్టేలా వాయిస్ మెసేజ్‌లు, ఫొటోల మార్ఫింగ్‌కు అవకాశం ఉండటంతో వాటిపై దృష్టి సారించారు. హద్దులు దాటితే చర్యలుంటాయని, అడ్మిన్‌దే బాధ్యత అని స్పష్టం చేస్తున్నారు.

**కొన్ని ఉదాహరణలు :**

రంగారెడ్డి జిల్లాలోని ఫరూక్ నగర్ మండలానికి చెందిన ఒక వ్యక్తి మండల పరిధిలో ఒక తండాకు సర్పంచిగా ఏకగ్రీవం చేస్తే గ్రామ అభివృద్ధికి 25 లక్షల రూపాయలు గ్రామ అభివృద్ధికి ఇస్తానని వాట్సప్ గ్రూపులలో పోస్ట్ పెట్టారు ఇటీవల మహబూబ్ నగర్ జిల్లా జడ్చర్ల మండలానికి చెందిన ఒక వ్యక్తి తనను సర్పంచిగా ఏకగ్రీవం చేస్తే పంచాయతీ ఖాతాలో రూ.50 లక్షలు డిపాజిట్ చేస్తానని గ్రామ వాట్సప్ గ్రూపులో పోస్టు పెట్టారు. వనపర్తి జిల్లాలో ఓ మండల గ్రూపులో ఒకరు ఓ పార్టీ రాష్ట్ర నేతకు వ్యతిరేకంగా పోస్టులు పెట్టారు. మరో వ్యక్తి అభ్యంతరం తెలిపారు. చివరకు ఇద్దరి మధ్య వ్యక్తిగత దూషణల వరకు వెళ్లింది. గ్రూపు అడ్మిన్ అప్రమత్తమై ఇలాంటివి వ్యక్తిగతంగా పంచుకోవాలని స్పష్టం చేయడంతో చర్చ ఆపేశారు. నారాయణపేట జిల్లా మక్తల్ మండలంలోని ఓ గ్రామ గ్రూపులో అభ్యర్థిగా మీ ముందుకొస్తున్నానని పోస్టు పెట్టారు. అదే పార్టీలోని మరోవర్గం ఆయనకు సహకరించమని గ్రూపులో స్పష్టం చేశారు. దీంతో రెండు వర్గాల్లో విభేదాలు బహిర్గతమయ్యాయి. నాగర్ కర్నూల్ జిల్లాలో పలు గ్రూపుల్లో ఎన్నికల్లో డబ్బులు ఖర్చు చేయొద్దు, ఆర్థికంగా నష్టపోవద్దంటూ ప్రచారం చేస్తున్నారు. గద్వాల జడ్పీటీసీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నట్లు ఓ నేత అనుచరులు పోస్టులు పెట్టారు.. హద్దులు మీరితే ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘన కేసులు, ఐటీ చట్టం, బీఎన్ఎస్ కింద కేసులు కడతామని అధికారులు హెచ్చరిస్తున్నారు.

# ఒరిస్సా నుంచి బస్సులో వస్తున్న 20 కేజీల గంజాయి స్వాధీనం

- **ఒడిస్సాకు చెందిన నిందితుడి అరెస్ట్**
- **పట్టుకున్న గంజాయి విలువ రూ.11 లక్షలుగా ఉంటుందని అంచనా**

**హైదరాబాద్, మహా:** నాలుగు బ్యాగుల్లో గంజాయితో ఒరిస్సా నుంచి హైదరాబాద్ కు వచ్చే వోల్వో బస్సులో హైదరాబాద్ కు వస్తున్న ఒడిస్సా కు చెందిన నాభి నాయక్ అలియాస్ హరి కి సంబంధించిన 20.600 కేజీల గంజాయిని రంగారెడ్డి ఎన్ఫోర్స్మెంట్ టీం పట్టుకున్నారు. వివరాల్లోకి వెళితే.. గతంలో భారీగా గంజాయి స్మగ్లింగ్ చేస్తూ హైదరాబాద్ రాయదుర్గం ప్రాంతంలో ఎస్ఓటి పోలీసులకు పట్టుబడిన నాభిన్ నాయక్ అలియాస్ హరి ఒరిస్సా నుంచి నాలుగు బస్తాల్లో 20 కేజీలకు పైగా గంజాయిని తీసుకువస్తూ ఉన్నాడనే సమాచారం అందుకున్న ఎక్సైజ్ ఎన్ఫోర్స్మెంట్ రంగారెడ్డి జిల్లాకు చెందిన ఏఈఎస్ జీవన్ కిరణ్ సిఐలు సుభాష్ చందర్ ఇతర సిబ్బందిని కలిసి రామోజీ ఫిలిం సిటీ వద్ద బస్సును నిలిపి తనిఖీలు నిర్వహించి అందులో ఉన్నటువంటి గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పట్టుకున్న గంజాయి విలువ రూ.11 laks మేర ఉంటుందని అంచనా వేశారు. గంజాయిని పట్టుకున్న టీంలో ఏఈ ఎస్ జీవన్ కిరణ్ సిఐలు సుభాష్ చందర్ బాలరాజు ఎస్ఐలు వెంకట్ రవి అఖిల్ తో పాటు సిబ్బంది ఉన్నారు. పట్టుకున్న గంజాయిని నిందితుడిని హయత్ నగర్ ఎక్సైజ్ స్టేషన్లో అప్పగించారు. గంజాయిని పట్టుకున్నటువంటి ఎన్ఫోర్స్మెంట్ టీంను ఎక్సైజ్ ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టర్ షానవాజ్ ఖాసీం, డిప్యూటీ కమిషనర్ పి దశరథ్ అసిస్టెంట్ కమిషనర్ ఆర్ కిషన్లు అభినందించారు.

## ప్రపంచ అంతరిక్ష వారోత్సవం 2025లో పాల్గొన్న ఎమ్మెల్యే బేబీ నాయన




**విజయనగరం,మహా:** బొబ్బిలి పట్టణం లో రాజా ఆర్. ఎస్. ఆర్. కే. రంగారావు కళాశాలలో ఈరోజు నిర్వహించిన ప్రపంచ అంతరిక్ష వారోత్సవం 2025 కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా బొబ్బిలి శాసనసభ్యులు బేబీ నాయన పాల్గొన్నారు.సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ ఎస్.డి.ఎస్.సీ షార్ వారి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బేబీనాయన మాట్లాడుతూ బొబ్బిలి ప్రాంతపు చారిత్రక మరియు ప్రాధాన్యత గురించి ప్రస్తావిస్తూ, అంతరిక్ష శాస్త్రం మరియు సాంకేతికత యొక్క ప్రాముఖ్యతను గురించి వివరించారు.భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ ఇస్రో విజయాలను మరియు ఆపరేషన్ సింధూర్ లో ఇస్రో చేసిన సేవలను ప్రశంసించారు. ప్రపంచ అంతరిక్ష వారం నిర్వాహక కమిటీ చైర్మన్ టి. కృష్ణ, ఎస్.డి.ఎస్.సీ షార్ కంట్రోలర్ మరియు డిప్యూటీ డైరెక్టర్ జి.రమేష్, డబ్ల్యు.ఎస్.డబ్ల్యు 2025 సభ్య కార్యదర్శి ప్రదీప్ నాయక్ , కళాశాల జాయింట్ సెక్రటరీ రావు బదరీ, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# లక్ష్మణనన్నా.. ఐయామ్ వెరీ సారీ!

- **అడ్లూరికి పొన్నం క్షమాపణలు.. ముగిసిన వివాదం**
- **మంత్రుల మధ్య సయోధ్య కుదిరించిన టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్**
- **పొన్నం క్షమాపణ కోరడంతో సమస్య సమసిపోయిందన్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్**

**హైదరాబాద్, మహా:** టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ చొరవతో మంత్రుల మధ్య వివాదం ముగిసింది. ఇద్దరు మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ మధ్య మాటల వివాదం చర్చనీయాంశంగా మారిన విషయం తెలిసిందే. తాజాగా మంత్రి పొన్నం ప్రభాకర్.. మంత్రి లక్ష్మణ్ కుమార్‌కు క్షమాపణ చెప్పారు. లక్ష్మణ్ బాధ పడినా దానికి నేను క్షమాపణలు కోరుతున్నా అని పొన్నం ప్రభాకర్ అన్నారు. 'ఆదే సమయంలో సామాజిక న్యాయానికి ఛాంపియన్ కాంగ్రెస్ పార్టీ. హస్తం పార్టీలో పుట్టి పెరిగిన వ్యక్తిని నేను.. మంత్రి అడ్లూరి, పార్టీ సంక్షేమం మధ్య ఎటువంటి దురుద్దేశం లేదు. నేను ఆ మాట అనకపోయినా పత్రికల్లో వచ్చిన దాని ప్రకారం ఆయన బాధ పడిన దానికి నేను క్షమాపణలు కోరుతున్నాను. నాకు అలాంటి ఆలోచన లేదు. నేను ఆ ఒరవడిలో పెరగలేదు. కాంగ్రెస్ పార్టీ నాకు ఆ సంస్కృతి నేర్పలేదు. ఐక్యంగా పోరాటం చేస్తాం, కలిసి ముందుకు సాగుతామని తెలిపారు. సామాజిక న్యాయానికి పోరాడే సందర్భంలో వ్యక్తిగత అంశాలు పక్కన ఉంచి కాంగ్రెస్ పార్టీ సామాజిక న్యాయంలో బలహీనవర్గాల బిడ్డగా ఈరోజు రేవంత్ రెడ్డి, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ నాయకత్వంలో రాహుల్ గాంధీ సూచన మేరకు 42 శాతం రిజర్వేషన్లకు పోరాటం జరుగుతుంది. మేమంతా ఐక్యంగా భవిష్యత్‌లో కాంగ్రెస్ పార్టీ సామాజిక న్యాయం కోసం పని చేస్తాం' అని తెలిపారు. టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. 'పొన్నం ప్రభాకర్ చేశారన్న వ్యాఖ్యల పట్ల లక్ష్మణ్ నొచ్చుకోవడం, యావత్ సమాజం కొంత బాధపడింది. మంత్రుల మధ్య జరిగిన ఘటన కుటుంబ సమస్య. జరిగిన ఘటన పట్ల చింతిస్తూ మంత్రి ప్రభాకర్ క్షమాపణలు చెప్పారు. మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కష్టపడి పైకొచ్చిన నేతలు. ఈ సమస్య ఇంతటితో సమసిపోవాలని యావత్ మాదిగ సామాజిక వర్గానికి విజ్ఞప్తి చేస్తున్నా. సహచర మంత్రి వర్గానికి విజ్ఞప్తి చేస్తున్నా.. ఎక్కడ మాట్లాడిన బాధ్యతాయుతంగా వ్యవహరించాలి. కాంగ్రెస్ పార్టీ అన్ని వర్గాల పార్టీ' అని తెలిపారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ మాట్లాడుతూ.. 'అట్టడుగు సామాజిక వర్గాలకు కాంగ్రెస్ అండగా ఉంటుంది. జెండా మోసిన నాకు మంత్రిగా అవకాశం ఇచ్చారు. పార్టీ లైన్ దాటే వ్యక్తిని నేను కాదు. పొన్నం ప్రభాకర్‌ను గౌరవిస్తా.. కానీ, పొన్నం వ్యాఖ్యల పట్ల నా మాదిగ జాతి బాధపడింది. పొన్నం క్షమాపణ కోరడంతో ఈ సమస్య ఇంతటితో సమసిపోయింది అని చెప్పుకొచ్చారు.

# దేశ చరిత్రలో ఏపీకి అతిపెద్ద విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి

- **రూ.87,520 కోట్లతో విశాఖలో రైడెన్ ఇన్ఫోటెక్ డేటా సెంటర్ ఏర్పాటు**
- **రూ.1,14,824 కోట్ల పెట్టుబడులకు 11వ ఎస్ఐపీబీ ఆమోదం**
- **26 ప్రాజెక్టుల ద్వారా 67,218 మందికి ఉద్యోగ అవకాశాలు**
- **మెగా ప్రాజెక్టులకు ప్రత్యేక అధికారులను నియమించాలని నిర్ణయం**
- **సీఎం చంద్రబాబు అధ్యక్షతన ప్రాజెక్టులకు ఆమోదం తెలిపిన పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు**
- **ఇప్పటి వరకూ 11 ఎస్ఐపీబీల ద్వారా రూ.7.07 లక్షల కోట్లు పెట్టుబడులు- 6.20 లక్షల ఉద్యోగ అవకాశాలు**

**అమరావతి, మహా :** పెట్టుబడుల ఆకర్షణలో ఆంధ్ర ప్రదేశ్ సరికొత్త అధ్యాయాన్ని లిఖించింది. దేశ చరిత్రలోనే అతిపెద్ద విదేశీ ప్రత్యక్ష పెట్టుబడిని ఆకర్షించింది. అమెరికా వెలుపల అతిపెద్ద డేటా సెంటర్‌ను గూగుల్ అనుబంధ సంస్థ రైడెన్ ఇన్ఫోటెక్ ఇండియా లిమిటెడ్ విశాఖలో ఏర్పాటు చేయనుంది. రూ.87,520 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేయనున్న ఈ డేటా సెంటర్ ప్రాజెక్టుకు ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన సమావేశమైన 11వ రాష్ట్రస్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు ఆమోదాన్ని తెలియచేసింది. విశాఖలోని తర్లువాడ, అడవివరం, అచ్యుతాపురం సమీపంలోని రాంబిల్లి వద్ద మూడు క్యాంపస్‌లలో రైడెన్ ఇన్ఫోటెక్ డేటా సెంటర్లను ఏర్పాటు చేయనుంది. విశాఖకు రానున్న కేబుల్ ల్యాండింగ్ స్టేషన్‌కు అనుసంధానంగా ఈ క్యాంపస్‌లు ఏర్పాటు కానున్నాయి. ఈ ప్రాజెక్టుతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ప్రాజెక్టుల ద్వారా రూ.1,14,824 కోట్ల పెట్టుబడులకు ఆమోదం లభించింది. తద్వారా 67,218 మందికి ఉద్యోగాలు లభించనున్నాయి. దాదాపు 3 గంటల పాటు సుదీర్ఘంగా సాగిన ఎస్ఐపీబీ సమావేశం..ఇంధన రంగంతో పాటు ఫుడ్ ప్రాసెసింగ్, ఐటీ, ఏరో స్పేస్, ఆటోమొబైల్ మాన్యుఫాక్చరింగ్ రంగాలతో పాటు పర్యాటకానికి ఊతం ఇచ్చేలా ఆతిథ్య రంగానికి చెందిన ప్రాజెక్టులకు ఆమోదాన్ని తెలియచేసింది. రైడెన్ ఇన్ఫోటెక్ డేటా సెంటర్ ద్వారా దేశంలోనే అతిపెద్ద విదేశీ ప్రత్యక్ష పెట్టుబడిని ఏపీకి సాధించటంపై ఐటీ శాఖామంత్రి నారా లోకేష్‌కు ముఖ్యమంత్రి, మంత్రులు అభినందనలు తెలియచేశారు. క్వాంటం వ్యాలీ తరహాలోనే డేటా సెంటర్లు ఏపీకి టెక్నాలజీ గేమ్ చేంజర్‌గా మారతాయని అన్నారు. కేవలం 15 నెలల కాలంలో పెట్టుబడుల ప్రయత్నాలు సత్ఫలితాలు ఇస్తున్నాయని సీఎం ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. డేటా సెంటర్లతో ఓ ఎకో సిస్టం వస్తోందని.. విశాఖ నగరం తదుపరి స్థాయి ఏఐ సిటీగా మారుతుందని ముఖ్యమంత్రి అభిప్రాయం వ్యక్తం చేశారు. విద్యుత్ తక్కువ ధరకు అందిస్తే ఐటీ రంగానికి మేలు జరుగుతుందని సీఎం వ్యాఖ్యానించారు. ఇప్పటి వరకూ జరిగిన 11 ఎస్ఐపీబీల ద్వారా రూ.7.07 లక్షల కోట్ల పెట్టుబడులకు ఆమోదం తెలిపారు. ఈ ప్రాజెక్టుల ద్వారా 6.20 లక్షల మందికి నేరుగా ఉద్యోగాలు దక్కనున్నాయి.

**ప్రాంతాల వారీగా పారిశ్రామిక ప్రాజెక్టుల అభివృద్ధి**

క్వాంటం వ్యాలీ తరహాలోనే రాష్ట్రానికి వస్తున్న ఈ డేటా సెంటర్లు టెక్నాలజీ రంగంలో కీలక మలుపు అని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. విశాఖ పారిశ్రామిక అభివృద్ధి కోసం ఏర్పాటు చేసిన ఎకనమిక్ కారిడార్ తరహాలోనే రాయలసీమకూ ఓ ప్రత్యేక కారిడార్‌ను ఏర్పాటు చేయాల్సి ఉందని ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ ప్రతిపాదించారు. ఆమేరకు మూడు ప్రాంతాలను పారిశ్రామిక జోన్లుగా విభజించి అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. తూర్పుగోదావరి నుంచి శ్రీకాకుళం వరకూ విశాఖ ఎకనామిక్ రీజియన్‌ను ఏర్పాటు చేస్తున్నామని అదే తరహాలో అమరావతి కేంద్రంగా ఉమ్మడి పశ్చిమ గోదావరి నుంచి ప్రకాశం వరకూ ఒక ఆర్థిక ప్రగతి రీజియన్‌ను ,నెల్లూరు, రాయలసీమ జిల్లాలతో మరో ఎకనామిక్ డెవలప్మెంట్ రీజియన్లను ఏర్పాటు చేసుకోవాలని సీఎం సూచించారు. ప్రస్తుతం రాయలసీమ ప్రాంతంలో ఏరో స్పేస్, ఎలక్ట్రానిక్స్ , డ్రోన్ సిటీలతో పాటు ఆటోమొబైల్ కారిడార్లు అభివృద్ధి అవుతున్నాయని సీఎం అన్నారు. వీటితో పాటు ఉద్యాన పంటలకు కేంద్రంగా ఉన్న రాయలసీమ ఆగ్రో ప్రాసెసింగ్ హబ్‌గా మారుతోందని త్వరలోనే ప్రపంచ ప్రసిద్ధి చెందిన కేంద్రంగా ఈ ప్రాంతం మారుతుందని అన్నారు. అమరావతి రాజధాని నగరం క్వాంటం వ్యాలీతో నాలెడ్జి ఎకానమీ కేంద్రంగా మారుతుందని సీఎం అన్నారు. కర్నూలు జిల్లా ఓర్వకల్లును కూడా అతిపెద్ద పారిశ్రామిక ప్రాంతంగా తయారు చేయాలని.. దీని కోసం ల్యాండ్ బ్యాంక్‌ను సిద్ధం చేసుకుని ప్రాజెక్టులను ఆహ్వానించాలని అన్నారు. రాష్ట్రంలో ఏ ప్రాజెక్టు వచ్చినా ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని సీఎం ఆదేశించారు. అభివృద్ధిని ఎవరు అడ్డుకున్నా ఉపేక్షించబోమని ముఖ్యమంత్రి తేల్చి చెప్పారు. రాష్ట్రంలోని అన్ని పారిశ్రామిక ప్రాజెక్టులను రైల్వే లైన్‌కు కూడా అనుసంధానిస్తే లాజిస్టిక్స్ వ్యయం తగ్గి ఆయా ప్రాజెక్టులకు ప్రయోజనం కలుగుతుందని సీఎం అన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో విలువ జోడింపుపైనా దృష్టి పెట్టాలని అన్నారు. అలాగే ఆతిథ్య రంగానికి చెందిన ప్రాజెక్టులపైనా ప్రత్యేకంగా దృష్టి పెట్టి పర్యాటకులకు నాణ్యమైన వసతి లభించేలా చూడాలని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న వివిధ కేటగిరీల హోటళ్లకు అనుబంధంగా ఎకో సిస్టం కూడా వచ్చేలా చూడాలని సూచించారు. తిరుపతిలో ఉన్న కలినరీ ఇనిస్టిట్యూట్‌ను డీమ్డ్ యూనివర్సిటీగా హోదా పెంచి వివిధ సంస్థలను అనుసంధానించాలని పేర్కొన్నారు. కూచిపూడి, థింసా లాంటి సంప్రదాయాలతో పాటు వివిధ ఎక్స్ పీరియన్స్ సెంటర్లను ఏర్పాటు చేసే అంశంపై దృష్టి పెట్టాలని అన్నారు. ఇటీవల విజయం సాధించిన విజయవాడ ఉత్సవ్ తరహాలోనే విశాఖ, రాజమహేంద్రవరం లాంటి చోట్ల కూడా ఉత్సవ్‌లను నిర్వహించాలని సూచించారు.

**మెగా పారిశ్రామిక ప్రాజెక్టుల పర్యవేక్షణకు ప్రత్యేక అధికారులు**

అమెరికాలో వర్జీనియా నగరం డేటా వ్యాలీగా ఉందని.. ప్రస్తుతం విశాఖ కూడా రైడెన్, గూగుల్ ప్రాజెక్టులతో డేటా వ్యాలీగా రూపొందుతుందని ఐటీ మంత్రి నారా లోకేష్ ముఖ్యమంత్రికి వివరించారు. టీసీఎస్ సంస్థ కూడా ఇక్కడ త్వరలోనే క్యాంపస్‌ను ప్రారంభించనుందని.. ఒక్క విశాఖ నగరంలోనే 5 లక్షల మందికి ఉద్యోగాల కల్పన లక్ష్యంగా పనిచేస్తున్నామని మంత్రి తెలిపారు. దీనిపై స్పందించిన సీఎం.. ఐటీ సంస్థల్లు, అందులో పనిచేసే ఉద్యోగులకు హౌసింగ్‌తో పాటు రహదారులు, ఇతర మౌలిక వసతులు ఉండేలా ప్రణాళికలు చేయాలని సూచించారు. మాస్టర్ ప్లాన్‌తో స్థానిక టౌన్ షిప్‌లు ఏర్పాటు చేయాలని అన్నారు. అనకాపల్లి నుంచి విజయనగరం వరకూ ఉన్న ప్రాంతాన్ని అభివృద్ధి చేసే అవకాశం ఉందని ముఖ్యమంత్రి వివరించారు. వీటితో పాటు 5 లక్షల మంది వర్క్ ఫ్రమ్ హోమ్ ద్వారా ఉద్యోగాలు చేసుకునే అవకాశం కల్పించేలా చర్యలు చేపట్టాలని అన్నారు. రామాయపట్నం సమీపంలో వస్తున్న భారత్ పెట్రోలియం కార్పొరేషన్ రిఫైనరీతో పాటు ఆర్సెలార్ మిట్టల్, రైడెన్ డేటా సెంటర్ లాంటి భారీ ప్రాజెక్టులు ప్రారంభం అయ్యే వరకూ పర్యవేక్షణ చేసేలా ప్రత్యేక అధికారులను నియమించాలని అన్నారు. పారిశ్రామిక ప్రాజెక్టులకు లాజిస్టిక్స్‌ను ఇంటిగ్రేట్ చేసేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. రాష్ట్రంలోని పారిశ్రామిక ప్రాంతాలు, నీటి సరఫరా, వినియోగం లాంటి అంశాలపై మాస్టర్ ప్లాన్ రూపొందించాలని అధికారులను సీఎం ఆదేశించారు. 2028 నాటికల్లా జిందాల్ స్టీల్ ప్లాంట్ పూర్తి చేసేలా చూడాలని సీఎం పరిశ్రమల శాఖను ఆదేశించారు. ఎస్ఐపీబీ సమావేశానికి మంత్రులు నారా లోకేష్, కె.అచ్చెన్నాయుడు, పి.నారాయణ, టీజీ భరత్, కందుల దుర్గేష్, బీసీ జనార్ధన్ రెడ్డి, వాసంశెట్టి సుభాష్, అనగాని సత్యప్రసాద్‌తో పాటు సీఎస్ కె.విజయానంద్, పరిశ్రమలు, ఐటీ, ఫుడ్ ప్రాసెసింగ్, పర్యాటకం, ఆర్థికశాఖ ఉన్నతాధికారులు హాజరయ్యారు.

**11వ ఎస్ఐపీబీ సమావేశంలో ఆమోదం పొందిన ప్రాజెక్టుల వివరాలు ఇవీ**

1. యాక్మే ఊర్జా ఒన్ లిమిటెడ్ అనంతపురం జిల్లాలో సౌర విద్యుత్ ప్రాజెక్టులో రూ.2 వేల కోట్ల పెట్టుబడి, 1380 మందికి ఉద్యోగాలు
2. టాటా పవర్ రెన్యూవబుల్ ఎనర్జీ లిమిటెడ్ అనంతపురం జిల్లాలో 400 మెగావాట్ల సౌర విద్యుత్ ప్రాజెక్టు రూ.2 వేల కోట్ల పెట్టుబడి, 1,380 మందికి ఉద్యోగాలు
3. చింతా గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్ విజయనగరం జిల్లాలో పంప్డ్ ఎనర్జీ ప్రాజెక్టు రూ.12,905 కోట్ల పెట్టుబడి, 3వేల మందికి ఉద్యోగాలు
4. ఆంప్లిన్ ఎనర్జీ ట్రాన్సిషన్ కర్నూలు, నంద్యాల జిల్లాల్లో సౌరవిద్యుత్ ప్రాజెక్టు రూ.15.10 కోట్లు పెట్టుబడి
5. రిలయన్స్ కన్స్యూమర్ ప్రోడక్ట్స్ కర్నూలు జిల్లా ఓర్వకల్లు లో ఎఫ్ఎంసీజీలో రూ.758 కోట్ల పెట్టుబడులు, 500 మందికి ఉద్యోగాలు
6. గోద్రేజ్ ఆగ్రోవెట్ లిమిటెడ్ రూ.208 కోట్ల పెట్టుబడులు, 66 మందికి ఉద్యోగాలు
7. ఎస్వీఎఫ్ సోయా ప్రైవేట్ లిమిటెడ్ రూ.201 కోట్ల పెట్టుబడి, 436 మందికి ఉద్యోగాలు
8. ఫ్రెష్ బౌల్ హార్టికల్చర్ ప్రైవేట్ లిమిటెడ్ రూ.33 కోట్ల పెట్టుబడి, 200 మందికి ఉద్యోగాలు
9. దస్పల్లా అమరావతి హోటల్స్ అమరావతిలో రూ.200 కోట్ల పెట్టుబడి, 400 మందికి ఉద్యోగాలు
10. వీఎస్కే హోటల్స్ రిసార్ట్స్ అరకు వ్యాలీలో రూ.55 కోట్ల పెట్టుబడి, 98 మందికి ఉద్యోగాలు
11. శ్రీవేంకటేశ్వరా లాడ్జ్ ప్రైవేట్ లిమిటెడ్ శ్రీశైలంలో రూ.83 కోట్ల పెట్టుబడి, 300 మందికి ఉద్యోగాలు
12. సదరన్ గ్లోబ్ హోటల్స్ అండ్ రిసార్ట్స్ అమరావతిలో రూ.117 కోట్ల పెట్టుబడి, 300 మందికి ఉద్యోగాలు
13. మైరా బే వ్యూ రిసార్ట్స్ కొత్తవలసలో కన్వెన్షన్ సెంటర్ కు రూ.256 కోట్ల పెట్టుబడి
14. ఎస్వీఎస్ కనస్ట్రక్షన్స్ కాకినాడ లో రూ.87 కోట్ల పెట్టుబడి,
15. రైడన్ ఇన్ఫోటెక్ ప్రైవేట్ లిమిటెడ్ డేటా సెంటర్ ఏర్పాటుకు రూ.87,520 కోట్ల పెట్టుబడి, 200 మందికి ఉద్యోగాలు.
16. ఇమాజినేటివ్ టెక్నో సొల్యూషన్స్ ఇండియా విశాఖ కాపులుప్పాడ లో ఐటీ లాజిస్టిక్స్ రూ.140 కోట్ల పెట్టుబడి, 2600 మందికి ఉద్యోగాలు
17. శాన్వీరా ఇండస్ట్రీస్ లిమిటెడ్ అనకాపల్లిలో అడ్వాన్స్డ్ కార్బన్ కాంప్లెక్స్ రూ.2600 కోట్ల పెట్టుబడి, 800 మందికి ఉద్యోగాలు
18. శ్రీ సిమెంట్ లిమిటెడ్, పలనాడులో సిమెంట్ ఫ్యాక్టరీ విస్తరణ రూ.2260 కోట్ల పెట్టుబడి, 350 మందికి ఉద్యోగాలు
19. రేమండ్, జేకే మైనీ ప్రెసిషన్ టెక్నాలజీ అనంతపురంలో ఏరో స్పేస్ ఆటోమోటివ్ కాంపోనెంట్ రూ.430 కోట్ల పెట్టుబడి, 4,096 మందికి ఉద్యోగాలు
20. రేమండ్ జేకే మైనీ గ్లోబల్ ఏరోస్పేస్ లిమిటెడ్, అనంతపురంలో ఏరోస్పేస్ కాంపోనెంట్లు రూ.510 కోట్ల పెట్టుబడి, 1400 మందికి ఉద్యోగాలు.
21. భారత్ డైనమిక్స్ లిమిటెడ్, ప్రకాశం జిల్లా దొనకొండ వద్ద రూ.1200 కోట్ల పెట్టుబడి, 1400 మందికి ఉద్యోగాలు
22. అలీప్ ఓర్వకల్లు వద్ద మహిళా ఇండస్ట్రియల్ ఎస్టేట్ కోసం రూ.36.25 కోట్ల పెట్టుబడి, 3000 మందికి ఉద్యోగాలు
23. అవంతీ వేర్ హౌసింగ్ సర్వీసెస్ విశాఖలో గుర్రమ్ పాలెం, రూ.319 కోట్ల పెట్టుబడి
24 అస్సెల్ ఈఎస్ జీ కర్నూలు జిల్లా కృష్ణగిరిలో రూ.300 కోట్ల పెట్టుబడి, 300 మందికి ఉద్యోగాలు
25. ఫెయిర్ ఎక్స్ పోర్ట్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, విజయవాడ మల్లవెల్లి లో మెగా ఫుడ్ పార్క్ కోర్ ప్రాసెసింగ్ సెంటర్
26. జెఎస్ డబ్ల్యూ ఇండస్ట్రియల్ పార్క్, విజయనగరం లో ప్రైవేట్ మెగా ఇండస్ట్రియల్ పార్క్, రూ.531 కోట్ల పెట్టుబడి, 45000 మందికి ఉద్యోగ అవకాశాలు రానున్నాయి.

# జీవో 9కి గ్రీన్ సిగ్నల్?

- **స్థానిక సంస్థల ఎన్నికలకు లైన్ క్లియర్**
- **బీసీ రిజర్వేషన్ల పెంపుపై హైకోర్టులో వాడివేడిగా వాదనలు**
- **స్టే ఇవ్వాలన్న పిటిషనర్ విజ్ఞప్తిని పరిగణలోకి తీసుకోని ధర్మాసనం**
- **విచారణ నేటికి వాయిదా.. ఎన్నికలు సజావుగా జరిగే అవకాశం ఉందని చర్చ**
- **జీవో ఆధారంగా ఇప్పటికే స్థానిక సంస్థల ఎన్నికలకు షెడ్యూల్ కూడా రిలీజ్**
- **అడ్డంకులు లేకుంటే నేడే నోటిఫికేషన్ జారీ చేసే అవకాశం ఉందంటున్న న్యాయ నిపుణులు**

**హైదరాబాద్, మహా:** స్థానిక సంస్థల ఎన్నికలకు దాదాపు లైన్ క్లియర్ అయినట్లు తెలుస్తోంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నెం.9కు గ్రీన్ సిగ్నల్ పడే అవకాశం ఉన్నది. జీవో ఆధారంగా స్థానిక సంస్థల ఎన్నికలకు షెడ్యూల్ కూడా రిలీజ్ చేసింది రాష్ట్ర ఎన్నికల సంఘం. అయితే, ప్రభుత్వం ఇచ్చిన బీసీ రిజర్వేషన్ల జీవోను సవాలు చేస్తూ..రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన వంగా గోపాల్‌రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. గత రిజర్వేషన్లు రద్దు చేయకుండా కొత్త రిజర్వేషన్లు కల్పిస్తున్నారని..అవి కూడా రాజ్యాంగానికి విరుద్ధంగా 50 శాతానికి మించి ఉన్నాయని పిటిషనర్ కోర్టుకు దృష్టి తీసుకొచ్చారు. ఆ పిటిషన్‌పై ఇప్పటికే ప్రాథమిక విచారణ చేపట్టిన హైకోర్టు తదుపరి విచారణను నేటికి వాయిదా వేసింది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల పెంపునకు అనుకూలంగా హైకోర్టులో మొత్తం 7 ఇంప్లీడ్ పిటిషన్లు దాఖలయ్యాయి. కాంగ్రెస్ సీనియర్ నేత వీహెచ్‌తో పాటు బీజేపీ ఎంపీ ఆర్.కృష్ణయ్య, మెట్టు సాయి, రిటైర్డ్ ఐఏఎస్ చిరంజీవులు ఇప్పటికే ఇంప్లీడ్ పిటిషన్లు దాఖలు చేయగా లేటెస్ట్‌గా కాంగ్రెస్ నేతలు ఆది శ్రీనివాస్, ఇందిరా శోభన్, చరణ్ యాదవ్ కూడా ఇంప్లీడ్ పిటిషన్లు వేశారు.

**ఎన్నికలు సజావుగా జరగొచ్చనే చర్చ..**

గత విచారణ సందర్భంగా కూడా షెడ్యూల్ విడుదల చేయకుండా స్టే ఇవ్వాలని కోరగా హైకోర్టు తిరస్కరించింది. దీంతో ఆ మరుసటి రోజే ఎన్నికల కమిషన్ షెడ్యూల్ విడుదల చేసింది. ఈ నెల 6న సుప్రీంకోర్టులో విచారణ సందర్భంగా కూడా పిటిషనర్లు స్థానిక ఎన్నికలపై స్టే ఇవ్వాలని కోరారు. దేశ అత్యున్నత న్యాయస్థానం సైతం ఇందుకు నో చెప్పింది. బీసీ రిజర్వేషన్ల పెంపు వివాదం న్యాయస్థానానికి చేరడంతో స్థానిక ఎన్నికలు జరుగుతాయా? లేదా? అన్న ఉత్కంఠ గత కొన్ని రోజులుగా నెలకొంది. ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో చెల్లదని.. దాన్ని కోర్టులు కొట్టి వేస్తాయన్న విశ్లేషణలు కూడా వినిపించాయి. అయితే.. జీవోను సవాల్ చేస్తూ వచ్చిన పిటిషన్లపై విచారణ చేపట్టిన హైకోర్టు స్థానిక ఎన్నికలను ఆపేందుకు మాత్రం ఎలాంటి ఆదేశాలు ఇవ్వడం లేదు. దీంతో ఎన్నికలు సజావుగా జరగొచ్చనే చర్చ సాగుతోంది. ఎట్టి పరిస్థితుల్లోనూ 42 శాతం బీసీ రిజర్వేషన్లతో స్థానిక ఎన్నికలను నిర్వహించాలని భావిస్తున్న ప్రభుత్వానికి హైకోర్టు తాజా ఆదేశాలు ఊరటనిచ్చాయి.

**నేడు నోటిఫికేషన్ జారీ చేసే అవకాశం..**

స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం నేడు నోటిఫికేషన్ జారీ చేసే అవకాశం ఉంది. స్థానిక సంస్థల ఎన్నికలపై హైకోర్టు నుంచి ఎలాంటి అడ్డంకులు లేనందున నోటిఫికేషన్ జారీ చేసే అవకాశాలున్నాయి. హైకోర్టు ఆదేశాల మేరకు నడుచుకుంటామని తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ పై స్టే ఇవ్వాలని పిటిషనర్లు కోరినా కూడా హైకోర్టు నిరాకరించింది. హైకోర్టులో బుధవారం నాడు జరిగిన విచారణకు సంబంధించిన అంశాలపై రాష్ట్ర ఎన్నికల సంఘం న్యాయ నిపుణులతో చర్చిస్తోంది. హైకోర్టు ఇప్పటివరకు స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి ఎలాంటి అడ్డంకులు చెప్పనందున నోటిఫికేషన్ జారీ చేసే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయనే న్యాయ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల కు రాష్ట్ర ఎన్నికల సంఘం సెప్టెంబర్ 29న షెడ్యూల్ ను విడుదల చేసింది. ఇక తెలంగాణ హైకోర్టులో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల మీద విచారణ జరిగింది. ఈ సందర్భంగా ప్రభుత్వం, పిటిషనర్ల తరఫు న్యాయవాదులు బలంగా వాదనలు వినిపించారు. స్థానిక సంస్థల ఎన్నికలకు గురువారం నోటిఫికేషన్ జారీ మీద స్టే ఇవ్వాలని పిటిషనర్ కోరారు.

**పిటిషనర్ల తరపున న్యాయవాది వాదనలు..**

రిజర్వేషన్లు పెంచుకునే అధికారం ప్రభుత్వానికి ఉన్నా 50 శాతానికి మించరాదు. విద్య, ఉద్యోగాల్లో 50శాతం దాటినా రాజకీయ రిజర్వేషన్లు పెంచరాదు. ఏజెన్సీల్లో ఎస్టీలకు మాత్రమే రిజర్వేషన్ల సీలింగ్ వర్తించదు. 42శాతం రిజర్వేషన్లపై శాస్త్రీయ ఆధారాలు చూపలేదు. బీసీ కుల గణన చేశారు. కానీ బహిర్గతం చేయలేదు. బీసీ కులగణన ఆధారంగా 42శాతం రిజర్వేషన్లు అంటున్నారు. ఎస్సీ, ఎస్టీల రిజర్వేషన్లకు మాత్రం 2011 జనాభా ఆధారం అని చెబుతున్నారు. ఎస్సీ, ఎస్టీల జనాభా పెరిగిందా? తగ్గిందా? ఆ లెక్కలు ప్రభుత్వం వద్ద లేవు. ఎస్సీ, ఎస్టీల జనాభాను లెక్కలోకి తీసుకోకుండా బీసీ రిజర్వేషన్లు ఎలా చేస్తారు? రాజ్యాంగ బద్ధంగా ఎన్నికల నిర్వహణకు మేం వ్యతిరేకం కాదు. రాజ్యాంగ విరుద్ధంగా ఎలా నిర్వహిస్తారు? ట్రిపుల్ టెస్ట్‌ను పాటించకుండా రాష్ట్ర ప్రభుత్వాలు రిజర్వేషన్లపై చట్టం చేయలేవు. 50 శాతం రిజర్వేషన్ల పరిధి దాటడం రాజ్యాంగ విరుద్ధం.

**ప్రభుత్వం తరపున అభిషేక్ సింఘ్వీ వాదనలు..**

చట్టాన్ని ఎవరూ ఛాలెంజ్ చేయలేదు. చట్టం ఆధారంగా చేసిన జీవోలను ఛాలెంజ్ చేశారు. జీవోకు మూలమైన చట్టాన్ని సవాల్చేయకుండా జీవోను మాత్రమే ఛాలెంజ్ చేయడం కుదరదు. దాదాపు అన్ని రాజకీయ పార్టీలు బీసీ రిజర్వేషన్లను సమర్థించాయి. రిజర్వేషన్ల గరిష్ఠ పరిమితి దాటకూడదని సుప్రీం కోర్టు ఆదేశామే తప్పితే.. రాజ్యాంగంలో ఎక్కడా నిబంధన లేదు. డేటా ఆధారంగా ప్రభుత్వానికి, శాసన వ్యవస్థకు తగిన నిర్ణయం తీసుకునే అధికారం ఉంది. శాసన వ్యవస్థ చేసిన చట్టాన్ని ఎవరూ ప్రశ్నించలేరు. సవరణ చేసినా, చట్టం చేసినా శాసనవ్యవస్థదే నిర్ణయం ఉంటుంది. చట్టసభలు చేసిన చట్టాలపై కొంతమంది గవర్నర్లు ఏ నిర్ణయమూ చెప్పడం లేదు. బిల్లును ఆమోదించడం లేదు, తిరస్కరించడం లేదు, తిప్పిపంపడం లేదు. ఇప్పటికే ఎన్నికల షెడ్యూల్ విడుదలైంది. ఎన్నికల ప్రక్రియలో కోర్టులు జోక్యం చేసుకోవద్దనే తీర్పులున్నాయి. ఈ సమయంలో స్టే ఇవ్వడం సరికాదు. సమగ్ర అధ్యయనం చేసిన తర్వాతే బీసీ బిల్లు చేశారు, జీవో తెచ్చారు. పూర్తి వాదనలు విన్న తర్వాతే జీవో నెంబరు 9పై నిర్ణయం తీసుకోవాలి.



## సుప్రీం కోర్ట్ చీఫ్ జస్టిస్ గవాయ్ పై దాడి న్యాయవ్యవస్థపై దాడి

### ప్రతి భారతీయుడు దాడిని ఖండించాలి

**విజయనగరం, మహా:** సుప్రీం కోర్ట్ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్ పై జరిగిన దాడి మన న్యాయవ్యవస్థపై, రాజ్యాంగ స్ఫూర్తి పై జరిగిన దాడిగా భావించాలని కారుణ్య ఫౌండేషన్ మరియు రోటరీ జిల్లా చైర్మన్ జె సి రాజు అన్నారు. మంగళవారం ఆయన పాత్రి కేయులతో మాట్లాడుతూ సి జె ఐ పై జరిగిన దాడి ని ఆయన తీవ్రంగా ఖండించారు. అలాంటి విద్వేష చర్యలకు మనదేశంలో స్థానం లేదని అన్నారు. ప్రతిభారతీయుడు ఈ చర్యను ఖండించాలన్నారు సుప్రీంకోర్ట్ లో షూ విసిరిన న్యాయవాది చర్యను తేలికగా తీసుకోకూడదని ,ఈ సంఘటనను క్షుణ్ణంగా దర్యాప్తు చేయాలని నిందితుడు,తన వెనుక ఉన్న వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో సి జె ఐ కక్ష చర్యలకు పోకుండా ఆయన ప్రదర్శించిన మానవత్వం,విలువలు న్యాయవ్యవస్థ పై ఉన్న దృఢత్వం ప్రశంసనీయం అని అన్నారు.

# అందరి వాడు నవీన్ యాదవ్

- **ప్రజాభీష్టం మేరకే బీసీ యువకుడికి టికెట్**
- **కాంగ్రెస్ నిర్ణయంపై హర్షం**

**హైదరాబాద్, మహా :** జూబ్లీహిల్స్ ఉపఎన్నికల బరిలో కాంగ్రెస్ పార్టీ తన అభ్యర్థిగా స్థానిక యువ నాయకుడు నవీన్ యాదవ్ పేరును ప్రకటించడంపై హర్షం వ్యక్తమవుతోంది. నియోజకవర్గానికి చెందిన స్థానిక నేతగా, అన్ని వర్గాలకు సుపరిచితుడిగా నవీన్ యాదవ్‌కు మంచి గుర్తింపు ఉంది. యాదవ సామాజిక వర్గానికి చెందిన నవీన్‌కు బీసీ వర్గాల్లో పట్టుంది. అంతేకుండా నియోజకవర్గంలో మెజారిటీ ఉన్న ముస్లిం మైనారిటీ వర్గాలు కూడా ఆయన్ను తమవాడిగా భావిస్తుండడం గమనార్హం. కాంగ్రెస్ పార్టీ నవీన్ యాదవ్ అభ్యర్థిత్వాన్ని ప్రకటించగానే, వివిధ వర్గాల ప్రజలు ఆయనకు మద్దతు తెలుపుతున్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గం నుంచి ఆయన ఖచ్చితంగా విజయం సాధిస్తారని, ఈ ప్రాంత అభివృద్ధికి మరింతగా పాటుపడతారని పేర్కొంటున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిననాటి నుంచి ఇప్పటి వరకు జూబ్లీహిల్స్‌లో తాగునీరు, డ్రైనేజీ వ్యవస్థ, కమ్యూనిటీ హాళ్ల నిర్మాణం, పార్కుల అభివృద్ధి, రహదారుల మెరుగు వంటి మౌలిక సదుపాయాల కల్పనకు రూ.200 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టింది. దీనికి తోడుగా ఇప్పుడు స్థానికంగా ప్రజల సమస్యలు తెలిసిన, ప్రజల మనసెరిగిన నాయకుడిగా నవీన్ యాదవ్ నియోజకవర్గానికి మరింత మేలు చేస్తారని ఇక్కడి ప్రజలు విశ్వసిస్తున్నారు. కాంగ్రెస్ తన అభ్యర్థిగా నవీన్ యాదవ్ పేరును ప్రకటించడంతోనే అధికార పార్టీ గెలుపు ఖరారైందని పేర్కొంటున్నారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో తీవ్ర నిర్లక్ష్యానికి గురైన జూబ్లీహిల్స్ నియోజకవర్గాన్ని నవీన్ యాదవ్ అభివృద్ధి పథంలోకి తీసుకొస్తారని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. సేవా కార్యక్రమాలతో విస్తృతంగా ప్రజల్లోకి నవీన్ యాదవ్ కేవలం ఒక యువ రాజకీయ నాయకుడిగా మాత్రమే కాకుండా, ఒక సామాజిక కార్యకర్తగా, నిస్వార్థ సేవకుడిగా నిత్యం ప్రజలకు అందుబాటులో ఉన్నారు. 2009లోనే నవ యువ ఫౌండేషన్‌ను స్థాపించి నియోజకవర్గంలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. యువత, మహిళలు, మైనారిటీల సంక్షేమం కోసం కృషి చేస్తున్నారు. కోవిడ్ సమయంలో దగ్గరుండి ప్రజల అవసరాలను తీర్చారు. 2008లో 500 మందికి ఉచితంగా డీఎస్సీ కోచింగ్ ఇప్పించారు. వారిలో 40 మంది ఉద్యోగాలు సాధించడం గమనార్హం. అలాగే నిత్యం యువతకు ఎస్ఐ, కానిస్టేబుల్ కోచింగ్ ఇప్పిస్తూ పేద వర్గాలకు చెందిన విద్యార్థులకు అండా నిలుస్తున్నారు. ఇటీవల 2,000 మంది గర్భిణీలకు సామూహిక సీమంతం, 1000 మంది చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమాల్ని ఏర్పాటు చేశారు. ఇది ఇండియన్, లిమ్కా, తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకుంది. అలాగే నిత్యం సామూహిక వివాహాలు చేయించడం నవ యువ ఫౌండేషన్ సేవా కార్యక్రమాల్లో ఒక భాగం. జూబ్లీహిల్స్‌లో ముస్లిం మైనారిటీలు ఎన్నో ఏళ్లుగా డిమాండ్ చేస్తున్న స్మశాన వాటికకు ఎర్రగడ్డంలో స్థలాన్ని కేటాయించగలిగారు. యూసుఫ్‌గూడలో సిక్కుల శ్మశాన వాటిక కోసం ఉద్యమించి స్థలం కేటాయించగలిగారు. ఇది తెలంగాణలోనే సిక్కుల కోసం ఏర్పాటు చేసిన మొదటి స్మశాన వాటిక కావడం గమనార్హం. కోవిడ్ సమయంలో జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ప్రజలకు పెద్దఎత్తున నిత్యావసరాలు పంపిణీ చేశారు. ఇటీవల ఇందిరమ్మ మైనారిటీ మహిళా శక్తి పథకం కింద 5 వేల మంది మహిళలకు కుట్టుమిషన్లు పంపిణీ చేసి వారి ఆర్థిక స్వావలంబనకు నవీన్ యాదవ్ కృషి చేశారు. ఇలా నవీన్ యాదవ్ నిత్యం తన ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానికంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. గతంలో జూబ్లీహిల్స్ నుంచి రెండుసార్లు పోటీ చేసి ఓడినా కూడా నియోజకవర్గ ప్రజలను వీడకుండా నిత్యం వారికి అందుబాటులో ఉంటూ స్వచ్ఛందంగా సేవలందిస్తున్నారు. తద్వారా ఆయన జూబ్లీహిల్స్‌లో అన్ని వర్గాల ప్రజల్లో మాస్ లీడర్‌గా గుర్తింపు సంపాదించగలిగారు.

## స్వయంకృషితో ఎదిగిన నాయకుడు

రాజకీయంగా నవీన్ యాదవ్ స్వయంకృషితో ఎదిగిన నాయకుడు. 2014లో ఎంఐఎం టికెట్ పై జూబ్లీహిల్స్ నుంచి పోటీ చేసి 41,656 ఓట్లు (25.19%) సాధించి రెండో స్థానంలో నిలిచారు. 2018లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి 18,817 ఓట్లు సాధించారు. ఈ ఫలితాలు నియోజకవర్గంలోని బీసీలు, మైనారిటీలు, ఎస్సీ, ఎస్టీ, క్రిస్టియన్ వర్గాల్లో ఆయనకున్న ఆదరణకు నిదర్శనంగా నిలిచాయి. అనంతరం 2023 నవంబర్ 15న అప్పటి టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సమక్షంలో నవీన్ కాంగ్రెస్ పార్టీలో చేరారు.

# కమిటీ కుర్రోళ్లు కాంబో మళ్లీ రిపీట్..



గత ఏడాది చిన్న సినిమాగా విడుదలై అంచనాలు మించి భారీ విజయాన్ని సాధించిన 'కమిటీ కుర్రోళ్లు' సినిమా కాంబో మళ్లీ రిపీట్ కానుందన్న వార్త ఇప్పుడు సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. ప్రేక్షకులతో బాగా కనెక్ట్ అయ్యేలా తెరకెక్కిన ఆ చిత్రానికి దర్శకత్వం వహించిన యంగ్ టాలెంటెడ్ డైరెక్టర్ యదు వంశీ , నిర్మాత నిహారిక కొణిదెల మళ్లీ కలిసి కొత్త ప్రాజెక్ట్ కోసం చర్చలు జరుపుతున్నారని సమాచారం. విశ్వసనీయ వర్గాల ప్రకారం, ఈ కొత్త సినిమా 2026లో సెట్స్‌పైకి వెళ్లే అవకాశం ఉంది. పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ బ్యానర్‌పై ఈ సినిమా తెరకెక్కనుంది. 'కమిటీ కుర్రోళ్లు' విజయం తర్వాత ఈ కాంబినేషన్ మళ్లీ రిపీట్ అవుతుండటంతో ఇండస్ట్రీలో ఆసక్తి నెలకొంది. 'కమిటీ కుర్రోళ్లు' సినిమాకు అనేక ప్రత్యేకతలు ఉన్నాయి. ఈ సినిమాతో 11 మంది హీరోలు , 4గురు హీరోయిన్‌లు తెలుగు తెరకు పరిచయం అయ్యారు. రూ.9 కోట్ల బడ్జెట్ తో తెరకెక్కిన ఈ సినిమా రూ.18.5 కోట్లు థియేట్రికల్ వసూళ్లు , రూ.6 కోట్లు నాన్ థియేట్రికల్ బిజినెస్ సాధించి మొత్తం రూ.24.5 కోట్లు రాబట్టి సెన్సేషన్ సృష్టించింది. అవార్డుల రేసులో కూడా 'కమిటీ కుర్రోళ్లు' దుమ్ము రేపింది. సైమా 2025లో ఈ చిత్రం ఘన విజయం సాధించింది. బెస్ట్ డెబ్యూ ప్రొడ్యూసర్‌గా నిహారిక కొణిదెల, బెస్ట్ డెబ్యూ యాక్టర్‌గా సందీప్ సరోజ్ అవార్డ్ అందుకున్నారు. అలాగే తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన గద్దర్ అవార్డుల్లో కూడా రెండు ప్రతిష్ఠాత్మక పురస్కారాలను దక్కించుకుంది. జాతీయ సమైక్యత, మత సామరస్యం, అణగారిన వర్గాల అభ్యున్నతిపై తీసిన ఉత్తమ ఫీచర్ ఫిల్మ్ అవార్డుతో పాటు ఉత్తమ డెబ్యూ డైరెక్టర్ అవార్డు యదు వంశీ దక్కించుకున్నాడు. ఇక ప్రస్తుతం పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ బ్యానర్‌పై ప్రొడక్షన్ నెం.2 గా మరో ప్రాజెక్ట్ ఇటీవలే ప్రారంభమైంది. ఈ చిత్రానికి మానస శర్మ దర్శకత్వం వహిస్తున్నారు. ఇందులో సంగీత్ శోభన్ , నయన్ సారిక జంటగా నటిస్తున్నారు. ఫ్యాంటసీ-కామెడీ జానర్‌లో తెరకెక్కుతున్న ఈ సినిమాకు అనుదీప్ దేవ్ సంగీతం అందిస్తున్నారు.

# ఓవైపు తెలుగు.. మరోవైపు తమిళ సినిమాల్లో...

హీరోయిన్లకు మొదట ఒకే ఒక్క ఛాన్స్ వస్తుంది. అదృష్టం కలిసొచ్చి ఆ మూవీ హిట్ అయితే తర్వాత అవకాశాలు వెల్లువలా వస్తాయి. కాయదు లోహర్ పరిస్థితి ఇప్పుడు అలానే ఉన్నట్లు కనిపిస్తోంది. 2021లో కన్నడ చిత్రంతో హీరోయిన్‌గా ఎంట్రీ ఇచ్చింది. తర్వాత తెలుగులోనూ 'అల్లూరి' అనే మూవీ చేసింది. కానీ పెద్దగా వర్కౌట్ కాలేదు. గతేడాది తమిళంలో వచ్చిన 'డ్రాగన్'.. ఈమె కెరీర్‌ని మలుపు తిప్పేసింది. దీంతో ప్రస్తుతం తమిళ, మలయాళ, తెలుగు భాషల్లో నాలుగైదు సినిమాలు చేస్తూ ఫుల్ బిజీగా మారిపోయింది. తమిళంలో ఇదయం మురళి అనే సినిమా చేయగా.. ఇది విడుదలకు సిద్ధమైంది. తెలుగులోనూ విశ్వక్ సేన్ 'ఫంకీ'లో ఈమెనే హీరోయిన్. ఇప్పుడు తమిళంలో విశాల్ సరసన ఛాన్స్ కొట్టేసినట్లు వార్తలొస్తున్నాయి. దర్శకుడు సుందర్.సివిశాల్ కాంబోలో ఈ ఏడాది 'మదగజరాజా' వచ్చింది. హిట్ అయింది. దీంతో ఇప్పుడు రిపీట్ కాబోతున్న కాంబోలోకి కాయదు వచ్చి చేరినట్లు తెలుస్తోంది. సుందర్.సి చిత్రాల్లో హీరోయిన్లకు ప్రాముఖ్యత ఉంటుంది. అలానే ఒకరికి మించి హీరోయిన్లు ఉంటారు. గ్లామర్ కూడా అధిక మోతాదులోనే ఉంటుంది. త్వరలో విశాల్ హీరోగా తీయబోయే సినిమాలో ఇద్దరు బ్యూటీస్‌కి చోటు ఉంది. అందులో ఒక హీరోయిన్‌గా కాయదు లోహర్‌ని ఎంపిక చేసినట్లు సమాచారం. మరో హీరోయిన్ ఎంపిక జరుగుతున్నట్లు తెలుస్తోంది.



# పూజాహెగ్డే భారీ రెమ్యునరేషన్

## తెలుగులో మళ్లీ ఫాంలోకి వచ్చేనా..?

ఇండియన్ ఫిలిం ఇండస్ట్రీలో ఉన్న మోస్ట్ టాలెంటెడ్ భామల్లో టాప్‌లో ఉంటుంది పూజాహెగ్డే. తమిళం, హిందీ, తెలుగు భాషల్లో టాప్ స్టార్లతో కలిసి నటించి వన్ ఆఫ్ ది లీడింగ్ హీరోయిన్‌గా ఓ వెలుగు వెలిగింది. ఈ పొడుగు కాళ్ల సుందరికి తెలుగులో హిట్ పడక చాలా కాలమే అవుతుంది. తెలుగులో కూడా బ్యాక్ టు బ్యాక్ హిట్స్ అందుకుంటున్న మాలీవుడ్ స్టార్ యాక్టర్ దుల్కర్ సల్మాన్. ఈ లీడింగ్ హీరో రవి నెలకుడిటి దర్శకత్వంలో ఓ తెలుగు సినిమాకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడని తెలిసిందే. ప్రస్తుతం హైదరాబాద్‌లో జెట్ స్పీడ్‌లో షూటింగ్ కొనసాగుతోంది. ఈ సినిమాతో లాంగ్ గ్యాప్ తర్వాత పూజా హెగ్డే మళ్లీ తెలుగు ప్రేక్షకుల ముందుకు రాబోతుంది.

తాజా కథనాల ప్రకారం ఈ సినిమా కోసం పూజా హెగ్డే ఏకంగా రూ.3 కోట్లు పారితోషికం తీసుకుంటుందట.

అయితే రెమ్యునరేషన్ భారీగా డిమాండ్ చేస్తున్న కారణంగా పూజాహెగ్డే తెలుగు సినిమాలకు దూరమైందని కొన్ని రోజుల క్రితం వార్తలు చక్కర్లు కొట్టాయి. కానీ దుల్కర్ సల్మాన్ టీంకు ఈ విషయంలో ఎలాంటి అభ్యంతరాలు లేకపోవడంతో పూజా హెగ్డేను తమ టీంలోకి తీసుకుందట. ఇక ఈ పుకార్లకు ఫుల్ స్టాప్ పెడుతూ తెలుగులో దుల్కర్ సల్మాన్ సినిమాతో మళ్లీ ఫాంలోకి రావాలని చూస్తున్నట్టు అర్థమవుతుంది. ఇటీవలే రజనీకాంత్ నటించిన కూలీ సినిమాలో మోనికా సాంగ్‌లో మెరిసింది పూజా హెగ్డే. ఈ పాటలో అందాలు ఆరబోస్తూ కుర్రకారుకు కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. కూలీ సాంగ్ భారీ హిట్ అయింది. ఇక దుల్కర్ సల్మాన్ సినిమా బ్లాక్ బస్టర్ అయితే పూజాహెగ్డేకు తెలుగులో మళ్లీ మంచి రోజులు వచ్చినట్టేనని చెప్పొచ్చు.



# పర్సనల్ విషయాలని ఆన్‌లైన్‌లో పంచుకోలేను



నేషనల్ క్రష్‌గా పేరు తెచ్చుకున్న రష్మిక మందన్న ఈ మధ్య వార్తలలో తెగ నిలుస్తుంది. తాజాగా ఆమె మరోసారి వార్తల్లో నిలిచింది. సినిమాలూ, వ్యక్తిగత జీవితం, సోషల్ మీడియా యాక్టివిటీలతో ఆమె చుట్టూ ఎప్పుడూ హడావుడే ఉంటుంది. ఇటీవల ఆమెపై ట్రోలింగ్ తీవ్రంగా పెరిగిపోతున్న నేపథ్యంలో, రష్మిక ఈసారి కాస్త ఘాటుగానే స్పందించింది. ఇటీవల విడుదలైన కన్నడ బ్లాక్‌బస్టర్ 'కాంతార: చాప్టర్ 1' సినిమాపై స్పందించలేదని, కనీసం అభినందనలు చెప్పలేదని కొంతమంది నెటిజన్లు ఆమెపై ట్రోలింగ్ ప్రారంభించారు. "మీ కన్నడ ఇండస్ట్రీ నుంచి వచ్చిన గొప్ప సినిమా గురించి ఒక్క మాట కూడా మాట్లాడడంలేదేంటి?'' అంటూ కామెంట్లు పెట్టడంతో ఆమెకి చిర్రెత్తుకొచ్చింది. ఈ క్రమంలో రష్మిక స్పందిస్తూ .. "ఏ సినిమా అయినా విడుదలైన వెంటనే చూడలేను. కాంతార కూడా విడుదలైన కొన్ని రోజులకి చూసాను. వెంటనే టీమ్‌కి మెసేజ్ చేసి అభినందనలు కూడా తెలియజేశాను. తెర వెనక జరుగుతున్న విషయాలు అందరికీ కనిపించవు కదా. నేను ప్రతీ విషయాన్ని సోషల్ మీడియాలో పంచుకునే వ్యక్తిని కాదు. అందుకే ఎవరు ఏమనుకున్నా పట్టించుకోను. నా నటన గురించి వాళ్లు ఏం చెప్తారన్నదే నాకు ముఖ్యం," అని తేల్చిచెప్పింది. ఆమె వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఆమె అభిమానులు ఈ పోస్ట్‌కు మద్దతుగా నిలవగా, కొంతమంది నెటిజన్లు ఇంకా విమర్శలు చేయడం కొనసాగిస్తున్నారు. ఇక సినిమాల విషయానికి వస్తే, రష్మిక ప్రస్తుతం బాలీవుడ్‌లో 'థామా' అనే హారర్ థ్రిల్లర్ సినిమాలో నటిస్తోంది. ఆయుష్మాన్ ఖురానా హీరోగా నటిస్తున్న ఈ సినిమా అక్టోబర్ 21న విడుదల కాబోతుంది. ఈ సినిమాపై రష్మిక చాలా హోప్స్ పెట్టుకుంది. కన్నడ సినిమా ఇండస్ట్రీ నుండి వచ్చిన రష్మిక ఈ మధ్య కాలంలో తెలుగు, తమిళం, హిందీ భాషలలోను వరుస సినిమాలు చేస్తూ దూసుకుపోతుంది. ఇటీవలి కాలంలో రష్మిక నటించిన చాలా చిత్రాలు సూపర్ డూపర్ హిట్ అయ్యాయి. ఇప్పుడు ఈ చిత్రం కూడా మంచి విజయం సాధిస్తుందని నమ్ముతుంది.

EDITOR, PRINTER,PUBLISHER AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, PRINTED AT 19-12-458, BAIRAGIPATTEDA, TIRUPATHI - 517501, A.P., REGD NO : APTEL/2014/58382. PH NO : 6300992296, Email : mahapathrika2003@gmail.com.
PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. Corporate Office : 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana, IN - 500034